నమ్మలేని నిజాలు

సేంద్రీయ సాగు
ఆరోగ్య ఫలసాగు
ఆయుష్మాన్ భవ

ఎందుకు సారా
చల్లచల్లని నీరా
ఉంది కదరా!

పొట్టి క్రికెట్టు
క్రీడల కిరీటి
ఆటల మట్టి.

కుండలో సంద్రం
కుక్షిలోన బ్రహ్మాండం
సంతు సాధువు

గద్వాల కోట
చరిత్రలో ఓ పుట
రాయల బాట

– రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

శ్రీనిజాలు

కుట్రలకు కుతంత్రాలకు
దేంట్లోనూ చిక్కడు !
సి.ఎంలలో కేసీఆర్
మేటి, ఒకే ఒక్కడు !

కుటుంబం పెద్దతను, తన
మాట మీద నడిచె !
తెలంగాణ పరిపాలన
తొమ్మి దేండ్లు గడిచె !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 1-6-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 227 పేజీలు:6 వెల: రూ.1/-


# తెలంగాణ అర్చకులకు శుభవార్త..

## గౌరవభృతి రూ. 5 వేలకు పెంపు.. వయసు 65 ఏండ్లకు తగ్గింపు



హైదరాబాద్, మే31: రాష్ట్రంలోని అర్చకులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. వేదశాస్త్ర పండితులకు ప్రతి నెల ఇస్తున్న గౌరవభృతిని రూ. 2,500 నుంచి రూ. 5 వేలకు పెంచుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గోపన్‌పల్లిలో 9 ఎకరాల స్థలంలో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో బ్రాహ్మణుల సంక్షేమాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. బ్రాహ్మణ సదనాన్ని ప్రారంభించుకున్న నేటి శుభ సందర్భంలో బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న మరిన్ని నిర్ణయాలను మీ అందరికీ తెలియజేయడానికి సంతోషిస్తున్నాను అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు.

ప్రస్తుతం బ్రాహ్మణ పరిషత్ ద్వారా వేదశాస్త్ర పండితులకు ప్రతి నెల ఇస్తున్న గౌరవ భృతిని రూ. 2,500 నుంచి రూ. 5 వేలకు పెంచుతున్నాం. ఈ భృతిని పొందే అర్హత వయసును 75 ఏండ్ల నుంచి 65 ఏండ్లకు తగ్గిస్తున్నాం అని కేసీఆర్ ప్రకటించారు.

### మరో 2,796 దేవాలయాలకు ధూపదీప నైవేద్యం..

ప్రస్తుతం రాష్ట్రంలోని 3,645 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం వర్తిస్తున్నది అని కేసీఆర్ గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో 2,796 దేవాలయాలకు కూడా ధూపదీప నైవేద్యం పథకం విస్తరింపజేస్తాం. దీంతో రాష్ట్రంలో 6,441 దేవాయాలకు ధూపదీప నైవేద్యం కింద నిర్వహణ వ్యయం అందుతుంది. ఈ సందర్భంగా మరో శుభవార్త కూడా మీతో పంచుకుంటున్నాను. ఇప్పటి వరకు ధూపదీప నైవేద్యం పథకం కింద దేవాలయాల నిర్వహణ కోసం అర్చకులకు నెలకు రూ. 6 వేల చొప్పున ప్రభుత్వం అందిస్తున్నది. ఈ మొత్తాన్ని రూ. 10 వేలకు పెంచుతున్నామని తెలియజేస్తున్నాను. ఈ నిర్ణయం మీ అందరిని ఎంతో సంతోషపెడుతుందని భావిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

### బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్

వేద పాఠశాలల నిర్వహణ కోసం ఇస్తున్న రూ. 2 లక్షలను ఇక నుంచి యాన్యువల్ గ్రాంట్‌గా ఇస్తామని తెలియజేస్తున్నాను అని కేసీఆర్ తెలిపారు. ఐటీఎం, ఐఐఎం లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదివే బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింజేసే నిర్ణయం తీసుకున్నాం. అదే విధంగా అనువంశిక అర్చకుల సమస్యలను త్వరలో కేబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నాను. సనాతన ధర్మ పరిరక్షణ నిలయంగా, వేద పురాణాల ఇతిహాసంగా, విజ్ఞాన సర్వసంగా, వైదిక క్రతువుల కరదీపికగా, పేద బ్రాహ్మణుల ఆత్మబంధువుగా, లోక కల్యాణకారిగా తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఈ విప్రహిత వెలుగొందాలని ఆ దేవ దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

### బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తున్నాం : సీఎం కేసీఆర్

బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ. 100 కోట్లు కేటాయించి, ఆ నిధులతో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గోపన్‌పల్లిలో 9 ఎకరాల స్థలంలో నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో బ్రాహ్మణుల సంక్షేమాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు.

బ్రాహ్మణుల మనసు, మాట, శరీరం చేసే పని లోకహితం కోసమే అని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విధానం సర్వజన సమాదరణ, పేదరికం ఎవరి జీవితాల్లో ఉన్నా వారిని ఆదుకోవాలనే మానవీయ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుంది.

కులానికి పెద్దలైనా బ్రాహ్మణుల్లోనూ చాలా మంది పేదలు ఉన్నారు. వారిని ఆదుకోవడం ప్రభుత్వం తన బాధ్యతగా భావించింది. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను తెలంగాణ ప్రభుత్వం 2017, ఫిబ్రవరి 1న ఏర్పాటు చేసింది. బ్రాహ్మణ పరిషత్‌కు ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తున్నాం. ఈ నిధులతో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం అని కేసీఆర్ పేర్కొన్నారు.

### బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్..

విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు వివేకానంద ఓవర్సీస్ స్కాలర్‌షిప్ అందిస్తున్నాం. 780 మంది ఈ స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. పేద బ్రాహ్మణుల జీవనోపాధి నిమిత్తం బ్రాహ్మిణ్ ఎంపవర్‌మెంట్ స్కీం ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే పథకం అమలు చేస్తున్నాం. ఈ పథకం కింద గ్రాంట్‌గా రూ. 5 లక్షల గ్రాంట్‌ను ప్రభుత్వం అందిస్తున్నది. ఇందుకోసం ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 150 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని కేసీఆర్ తెలిపారు.

## బ్రిజ్ భూషణ్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..? కేంద్రాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మే31:రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిలదీశారు.

గత కొంతకాలంగా దేశ రాజధానిలో రెజ్లర్లు వివిధ రూపాల్లో నిరసనలు ఆందోళనలు తెలుపుతున్న కూడా కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రెజ్లర్లు లేవనెత్తుతున్న అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

కష్టపడి, నిబద్ధతతో, దేశభక్తితో మహిళా రెజ్లర్లు ప్రపంచానికి భారతదేశ ప్రతిభను కనబరిచారనీ ఆమె పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రెజ్లర్ల సమస్యల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

పోక్సో వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నప్పటికీ నిందితుడు బయట తిరుగుతున్నాడని, బాధితులకు న్యాయాన్ని నిరాకరించరాదని స్పష్టం చేశారు.

దేశానికి బంగారు పతకాలు సాధించిన మహిళ క్రీడాకారుల పట్ల అనుచితంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు.

ఈ వ్యవహారాన్ని మొత్తం ప్రపంచమంతా చూస్తోందని, దేశ ప్రజలు కేంద్ర ప్రభుత్వం నుంచి సమాధానాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి చర్యలు తీసుకోవాలని కవిత సూచించారు.

## భారత్‌లోకి అక్రమంగా చొరబడే యత్నం.. సరిహద్దుల్లో ముగ్గురు ఉగ్రవాదులు అరెస్ట్

జమ్ముకశ్మీర్, మే31: పాకిస్థాన్ నుంచి జమ్ముకశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భారత సైన్యం తిప్పికొట్టింది. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకు జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్ గుండా కొందరు ఉగ్రవాదులు వాస్తవాధీన రేఖ దాటి భారత్‌లో చొరబడేందుకు ప్రయత్నించారు. అర్ధరాత్రి వేళ భారీగా వర్షం పడుతున్న సమయాన్ని వారు చొరబాటుకు ఎంచుకున్నారు.

అయితే, జమ్ముకశ్మీర్ పోలీసులతో కలిసి సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న భారత సైన్యం ఉగ్రవాదుల చొరబాటును గమనించి కాల్పులు జరిపింది. ప్రతిగా ఉగ్రవాదులు కూడా ఎదురుకాల్పులు జరిపారు. కాల్పులు ఆగిపోయిన అనంతరం భద్రతా బలగాలు ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా ముగ్గురు ఉగ్రవాదులు గాయాలతో పడి ఉన్నారు.

ఆ ముగ్గురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది వారి నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అంతేగాక మందుపాతరలకు ఉపయోగించే దాదాపు 10 కేజీల మందుగుండు సామాగ్రిని కూడా సీజ్ చేశారు. ఘటనా ప్రాంతంలో ఇంకా గాలింపు కొనసాగుతున్నది. కాగా, ఉగ్రవాదుల కాల్పుల్లో ఒక జవాన్‌కు కూడా గాయాలయ్యాయి.

## విప్రహిత బ్రాహ్మణ సంక్షేమ సదనాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్



హైదరాబాద్, మే31: విప్రహిత బ్రాహ్మణ సదనం భవనాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణిదేవీ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు రమణాచారి, పీఠాధిపతులు, పండితులు పాల్గొన్నారు.

ఈ భవన నిర్మాణానికి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లి గ్రామంలో 6 ఎకరాల 10 గుంటల స్థలాన్ని కేటాయించింది. ఇందులో బ్రాహ్మణ సమాజ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని 12 నిర్మాణాలను చేపట్టారు. 2017 జూన్ 5న పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. మూడంతస్థుల్లో ఉన్న ఈ భవనంలో కల్యాణ మండపం, సమాచార కేంద్రం, పీఠాధిపతుల, ధర్మాచార్యుల సద నం ఉన్నాయి. భక్తి, ఆధ్మాత్మిక భావజాల వ్యాప్తికి సంబంధించిన సమస్త సమాచార కేంద్రంగా, రిసోర్స్ సెంటర్‌గా ఈ భవనం సేవలందించనున్నది. ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాల వంటి సాహిత్యంతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు.

## శ్రీవారు కరీంనగర్లో కొలువు దీరడం అదృష్టం -మంత్రి గంగుల



కరీంనగర్, మే31:అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కరీంనగర్లో అత్యంత వైభవంగా నిర్మిస్తూ శంకుస్థాపనం చేశామన్నారు

రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, నేడు పద్మనగర్ ప్రాంగణంలో తిరుమల తిరుపతి వేదపండితులచే టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, ఎంపీ దీవకొండ దామోదర్ రావు, ఎమ్మెల్యేలు రసమయి, సుంకే రవిశంకర్ ఎమ్మెల్సీలు విష్ణు భాను ప్రసాద్, కౌశిక్ రెడ్డి, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ భాస్కర్ రావు తదితర ప్రముఖుల, అశేష జనవాహిని సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమం అంగరంగా వైభవంగా జరిగింది. ఉదయం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన, అగ్ని ప్రణయం, కుంభారాధన, విశేష హోమాలు, ఫిలేష్టికలకు, శంఖువుకు, అభిషేకం అనంతరం వేదమంత్రాలతో శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వరుని కృపతోనే కరీంనగర్లో టీటీడీ ఆలయ నిర్మాణం సాకారం అయిందన్నారు, ఆలయ స్థలంలో ఆ దేవదేవుడే కోనేరు లాంటి పురాతన బావిని తనకిష్టమైన చింత చెట్టును ఏర్పాటు చేసుకోవడమే ఈ వైభవానికి నిదర్శనం అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ గారి దృష్టికి కరీంనగర్ ప్రజా ప్రతినిధులు ఆలయ అనుమతి కోసం ప్రతిపాదన చేసిన వెంటనే ఏపీ ముఖ్యమంత్రి జగన్ గారికి ప్రత్యేకంగా లేఖ రాయడం, కరీంనగర్ లో పదెకరాల స్థలాన్ని కేటాయించడం, తదనంతరం ఏపీ సీఎం ఆమోదంతో టీటీడీ ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరగడం చాలా సంతోషకరమన్నారు.

టీటీడీ 20 కోట్ల నిధులతో ఆలయాన్ని నిర్మిస్తుందని మిగతా నిర్మాణ నిధులను భక్తులమే సమకూర్చుకుంటామన్నారు. వెయ్యేళ్ల కాలంలో దొరికే ఈ గొప్ప కార్యంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమన్నారు మంత్రి, కరీంనగర్ ప్రజలం దరికి ఈ అదృష్టం దొరికినం దుకు సంతోషం వ్యక్తం చేశారు. సా యంత్రం అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తామని భక్తులు హాజరవ్వాలని కోరారు మంత్రి గంగుల.

ఇదే కార్యక్రమంలో మాట్లాడిన టిటిడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి కరీంనగర్ ఆలయ నిర్మాణం కోసం మంత్రి గంగులతో పాటు వినోద్ కుమార్, భాస్కరరావు, దామోదర్ రావు అభ్యర్థించారని, సీఎం కేసీఆర్ గారి విజ్ఞాపనతో ముఖ్యమంత్రి జగన్ నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారన్నారు. టీటీడీ తరఫున 20 కోట్ల నిధులను కేటాయించడంతోపాటు సంపూర్ణంగా తిరుమల మాదిరే క్రతువులు నిర్వహిస్తామని, తిరుమల వేద పండితులు నిరంతరం ఇక్కడే ఉంటారన్నారు. పోటు ద్వారా ప్రసాదాలను సైతం ఇక్కడే తయారు చేస్తామన్నారు.

మంత్రి గంగుల కమలాకర్ స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ నిర్మాణంపై చూపిస్తున్న శ్రద్ధ సంతోషం కలిగిస్తుందన్నారు.

## ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కారుకు ప్రమాదం.. కౌన్సిలర్ కు గాయాలు

నిజామాబాద్, మే31:ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కాన్వాయ్ కి ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ రహదారిపై ప్రమాదం జరిగింది. ఎమ్మెల్యే నిజామాబాద్ జిల్లాలో ఓ కార్యక్రమానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలు స్తోంది. ముందుగా వెళ్లున్న ఎమ్యె ల్యే కాన్వాయ్ ని బీఆర్ఎస్ కౌన్సిలర్ గంగా మోహన్ చక్రు కారు వేగం గా ఢీ కొట్టింది. దీంతో కౌన్సిలర్ కు తీవ్ర గాయాల య్యాయి. అయితే కారు లోని ఎయిర్ బ్యాగ్ ఓపెన్ కావడంతో కౌన్సిలర్ గంగా మోహన్ చక్రు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాద ఘటనకు సంబంధిం చిన పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## మహా పండితులు దివాకర్ల వెంటావధాని



మాట్లాడుతున్న దివాకర్ల బుద్ధ మురళీ. చిత్రంలో కళా జనార్ధనమూర్తి, శ్రీనివాస్ గుప్తా గుదిబండి వెంకటరెడ్డి

మహాపండితులు దివాకర్ల వెంకటావధాని అని సమాచార హక్కు చట్టం విశ్రాంత ముఖ్య సంచాలకుడు బుద్ద మురళి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మంగళవారం పరిశోధకులు, విమర్శకులు ఆచార్యదివాకర్ల వెంకటావధాని జయంతి కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా బుద్ధ మురళి హాజరై మాట్లాడుతూ..భువన విజయం వంటి సాహితీ రూపకకర్తగా సంస్కృతాంధభాషలపై సాధికారతగల గొప్ప వ్యక్తి వెంకటావధాని అని అన్నారు. సినారె, జీవీ సుబ్రహ్మణ్యం వంటివారు ఆయన శిష్యులేనన్నారు. పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, పొత్తూరి సుబ్బారావు, గుదిబండి వెంకటరెడ్డి, గీతాదేవి పాల్గొన్నారు.







నేటి కందం– నేటికి అందం



(జూన్ 1 ప్రపంచ తలిదండ్రులదినోత్సవం..
June 1st Global Parentsday)



–రాధశ్రీ
సెల్:9494481210

# బాలల హక్కుల పరిరక్షణే ప్రపంచ భవిత!

కరోనా మహమ్మారి కల్లోలం కాలంతో పాటు వాతావరణ ప్రతికూల మార్పులతో ప్రపంచ మానవాళికి దెబ్బ మీద దెబ్బ తగిలి విలవిల్లాడుతున్నది. విపత్తు తరువాత మరో విపత్తు వెంటబడుతున్నది. ఉద్యోగ ఉపాధులు తరిగిపోయాయి. వేతనాలు/కూలీ రేట్ల కోతలతో పేదలకు బతుకుదెరువు కరువైంది, జీవితం బరువెక్కింది. జీవనోపాధులు సన్నబడ్డాయి, అర్ధ ఆకలి రోజులు గడుపుతున్నాం. బతుక్కు, బతుకుదెరువుకు మధ్య పోరు సాగిస్తున్నాం. పని చేస్తేనే ముద్ద దొరికేది, పని దొరక్క పుస్తెలు అమ్ముకోవడం, పస్తులు ఉండడం చూస్తున్నాం. ఉపాధి లేకపోతే ఆకలి చావులు, పనికి వెళితే కోవిడ్–19 చావులు, అడ కత్తెరలో పోక చెక్కలా నలిగిపోతూ, నరకయాతన అనుభవించాం. కుటుంబ పెద్దల నిస్సహాయ దుస్థితి పిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపింది. పేద కుటుంబాల్లో పొయ్యిలో పిల్లులు నిద్రపోతున్నాం. నేటికీ రెండు పూటలా పోషకాహారం అందని ద్రాక్షే అవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా కరోనా కోరడా దెబ్బకు బాల్యం చితికి పోయింది, పోతున్నది. ముఖ్యంగా పేద కుటుంబాల పిల్లలు శారీరకంగా, మానసికంగా కుచించుకు పోయారు. నేటి బాలల బతుకులపై కరోనా దుష్ప్రభావం జీవితాంతం వెంటాడేలా ఉన్నది. పేద దేశాల్లో బాలల పరిస్థితి దుర్భరంగా ఉన్నది. పేద కుటుంబాల ఆదాయం తగ్గడం, ఉపాధులు దొరక్క పోవడంతో బాలల బాల్యం విష వలయంలో చిక్కకకు పోతున్నది. నిరుపేదలకు సాంఘీక, ఆర్థిక, విద్య, ఆరోగ్య, పోషకాహార భద్రత కరువైంది.

### అంతర్జాతీయ బాలల దినం–2023:

విశ్వవ్యాప్తంగా అధిక ప్రపంచ దేశాలు 01 జూన్ రోజున అంతర్జాతీయ బాలల దినం నిర్వహిస్తూ బాలల సంరక్షణ, బాలల హక్కుల పరిరక్షణ, బాలల హక్కుల ఉల్లంఘనలను వ్యతిరేకించడం, బాలల అక్రమ రవాణాను అడ్డుకోవడం, బాలల సంక్షేమానికి బాటలు వేయడం, పిల్లల జీవన ప్రమాణాలు పెంచడం లాంటి పలు అంశాలను చర్చిస్తారు. 01 జూన్ 1925లో జెనీవాలో జరిగిన "ప్రపంచ బాలల సంక్షేమ సదస్సు"కు గుర్తుగా ఈ వేడుక ఐరాస చొరవతో 1954 నుంచి "అంతర్జాతీయ బాలల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. ఇండియాలో నెహ్రూ జన్మదినం సందర్భంగా 14 నవంబర్ రోజున "జాతీయ బాలల దినం" నిర్వహిస్తున్నారు. నవంబర్ 20న "విశ్వ బాలల దినం" పాటించే దేశాలు కూడా ఉన్నాయి. పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాల సమయంలో బాలల హక్కులను కాలరాయడం, విద్యకు దూరం చేయడం, పీడించడం, అణచి వేయడం, వారి శక్తిని దుర్వినియోగం చేయడం, బాలల అక్రమ రవాణా, బాలకార్మిక సమస్య, పోషకాహారం అందించకపో వడం లాంటి సమస్యలు ప్రారంభమై నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. బాలలకు పోషకాహారం, వైద్య ఆరోగ్యం, ప్రేమ, సంరక్షణ, విద్య, వివక్ష నుంచి విముక్తి, హక్కుల పరిరక్షణ, సర్వతోముఖా భివృద్ధి లాంటివి కల్పించాల్సిన కనీస బాధ్యత పెద్దలుగా మనందరిదని గమనించాలి.

### విపత్తుల దెబ్బలు:

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వాతావరణ ప్రతికూలతలు, కరోనా విపత్తు ఫలితంగా ఏర్పడిన సాంఘీక ఆర్థిక సంక్షోభంతో 142 మిలియన్ల బాలలు కొత్తగా కడు పేదరికంలోకి నెట్టబడ్డి వారి సంఖ్య 750 మిలియన్లకు చేరడం జరిగింది. అభాగ్య బాలల్లో 66 శాతం సబ్–సహారా ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాలకు చెందిన వారే ఉండడం విశేషం. దాదాపు 150 మిలియన్ల బాలలు విద్య, ఆరోగ్యం, గృహ వసతులు, పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, సురక్షిత నీరు లాంటి వసతులు కూడా లేకుండా మరింత బక్కచిక్కి పోవడం జరిగింది, నేటికీ జరుగుతూనే ఉన్నది. ప్రపంచంలోని 463 మిలియన్ల పిల్లలు (ప్రతి ముగ్గురిలో ఒకరు) విద్యకు దూరమైనారని, ఈ బాలల వ్యక్తిత్వ వికాసం సరిగ్గా జరగడం లేదు. పోషకాహార లోపంతో పిల్లల ఎదుగుదల కుంటుబడటం, పలు తీవ్ర అనారోగ్యాలు కలగడం పరిశీలించబడింది.

### పెడియాట్రిక్ టాస్క్ ఫోర్స్‌లు ఏర్పాటు చేయలేమా:

విపత్తుల్లో బాలల మానసిక ఒత్తిడి, గాబరా పెరిగింది. దీనితో బాలల్లో అలసట, చికాకు, ఏకాగ్రత లేకపోవడం, నిద్ర లేమి లాంటి సమస్యలకు లోనయ్యారు. బాలలకు పోషకాహారం, ఆదరణ, సక్రమ నిద్ర, మానసిక చైతన్యం, శారీరక శ్రమ, గృహ ఆవరణలో ఆటపాటలు, స్నేహితులతో సరదాగా గడపడం, మంచి అలవాట్లను నేర్పడం, ఆరోగ్య సంరక్షణ లాంటి జాగ్రత్తలు నేటికీ తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. కరోనా రుద్దిన నిబంధనలతో వ్యక్తులకు, స్నేహితులకు దూరంగా ఉండడం, ఇరుగు పొరుగుతో అనుబంధాలు తగ్గడం, ఒంటరిననే భావన, బడులు/సాంఘీక కలయికలు లేకపోవడం, అమ్మనాన్నలు పనికి వెళ్ళడం లాంటివి లేత మనసులను గాయాల పాలుచేసింది. రాబోయే రోజుల్లో సీజల్ వ్యాధులు, మంకీఫాక్స్ లాంటి విపత్తుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు వివిధ స్థాయిల్లో పెడియాట్రిక్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేయడం, పిల్లల ఆసుపత్రుల్లో పడకలు కేటాయించడం, యూనివర్సల్ వ్యాక్సినేషన్ పూర్తి చేయడం, అత్యవసర ఔషధాలు, ఉపకరణాలు సిద్ధం చేయడం, తల్లితండ్రులను చైతన్య పరచడం లాంటి పలు చర్యలను ముందుగానే తీసుకోవాలి. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులను తలచి, పిల్లల పెరుగుదలకు సహకరిస్తూ, విపత్తులకు దూరంగా ఉంచుతూ, ముందుకు సాగుదాం.

(01 జూన్ 'అంతర్జాతీయ బాలల దినం' సందర్భంగా)

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## సునందామృతం

### కాకతాళీయ న్యాయము-7

కాకము అంటే కాకి. తాళము లేదా తాలః అంటే తాడి చెట్టు/ తాటి చెట్టు.

కాకి తాటి చెట్టు మీద వాలగానే అనుకోకుండా తాటిపండు రాలి పడటాన్ని కాకతాళీయం అంటారు.

కాకి వాలడం వల్ల తాటిపండు రాల లేదు. కాకికి ఆ తాటిపండును రాల్చేయాలనే ఆలోచనా లేదు. కాకి అటూ ఇటూ ఎగురుతూ వచ్చి తాటి చెట్టు మీద వాలడం.

సరిగ్గా ఆ సమయంలో తొడిమ ఊడి పండు రాలే సమయం ఆసన్నం కావడంతో చటుక్కున అది రాలి కింద పడటం జరిగింది.

ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తికి ఈ సంఘటన వల్ల తాటి పండు లభిస్తుంది. కాకి తనకోసమే దానిని పడవేసిందేమో అనుకుని ఆనంద పడతాడు. కానీ కాదు కదా!

ఈ విధంగా రెండు సంఘటనలు ఓకే సారి ఏక కాలంలో జరగడం విశేషం. ఇలా ఒకదానితో ఒకటి పొంతనలేని సంఘటనలు జరిగి వాటిమధ్య ఓ సంబంధాన్ని ఏర్పరడడాన్ని కాకతాళీయ న్యాయము అంటారు.

అప్పుడప్పుడు మన జీవితంలో అనుకోని సంఘటనలు మంచివో,చెడువో జరుగుతూ ఉంటాయి. అయితే వాటిని ఆయా వ్యక్తులకు ఆపాదిస్తూ ఉంటాం. కానీ తర్వాత తెలుస్తుంది కాకతాళీయంగా జరిగాయని.

అనుకోకుండా కొన్ని మంచి సంఘటనలు జరిగినప్పుడు కొందరు వ్యక్తులు ఆ సమయంలో అక్కడ ఉండటం జరుగుతుంది. అది కాకతాళీయంగా జరిగినా తమ వల్లే,తమ గొప్పే అని చెప్పుకోవడం, వాటిని నిజమే అనుకోవడం కూడా చూస్తూ ఉంటాం.

ఇలాంటి విషయాలకు కాకతాళీయ న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.



–పురిమళ్ల సునంద
9441815722

## నానీ



ఇంట్లోకి వాలిన
రంగుల పిట్ట టి.వి.
ఏం కూతలో
ఇది ఏ రకం జీవి!



-డా. సి. భవానీదేవి
9866847000

## తెలంగాణ జ్ఞాపకాలు!

(ఆటవెలదిలో...)

తెలుగు నేల యందు తెలగాణ మాతల్లి
తీరు గనుడు జనుల తెలివి మీర
పోరి తెచ్చుకున్న పుడమి యీ తెలగాణ
పూర్వ వైభవమ్ము పురము లందు!!

మిగులు బాటు నందు మేలు మా తెలగాణ
తగుల ఋణము దెచ్చి తగవు దీర్చ
వృద్ధి బొంది తమము వేగమే దీర్చుట
మేలు గలుగ బోదె మిగులు రాదె!

విజ్ఞతెరిగి నడువ విఱ్ఱవీగెడు వారు
వీడబోరె తాము వేగిరమ్ము
పదవి కాదు సుఖము పదకోశమున్ తెల్సి
పల్కు టనగ మెచ్చు పద్ధతదియె!

పూర్వ వైభవమ్ము పుడమి వీడంగను
క్రొత్త కట్టడములు కూర్మి బెంచె
నామరూపమేది నైజాము చక్కెర
కాగితంపు సొంపు కరిగి పోయె!

కరువు దీర్చ వచ్చె కాళేశ్వరపు నీరు
రాష్ట్ర మంత వెలసె రాగ దీప్తి
మిషను భాగిరథని మిగుల నీరటనుచు
త్రాగు నీటి వసతి తగవు దీర్చ!

పదవులున్నవారు పరదేశమేగుచు
పెట్టుబడుల దెచ్చి వెలుగు చుండ్రి
వ్యావహారికమున వ్యాపారులన్ దెచ్చి
అనుమతింతురంట యనుగు వార్కి!

సాంప్రదాయ మందు సంపద సృష్టించ
పుణ్యక్షేత్రములను ముందు గాను
ఆగమాగమయ్యి యాదగిరీశుని
అవని వెలుగు నట్లు అద్దిరటుల!!



-యెనిశెట్టి గంగా ప్రసాద్.
సెల్ 9866447234.

# తెలంగాణ సారస్వత పరిషత్ - తెలుగుభాష సేవ

హైదరాబాద్ నగరంలో 80 ఏళ్లకిందట ఆంధ్ర సాహితి సంస్కృతుల పరిరక్షణకు ఆంధ్రజన సంఘమును అప్పటి పెద్దలు స్థాపించారు. కాని ఆ సంఘము క్రమక్రమముగా రాజకీయ సంస్థగా రూపొందినందు వలన సారస్వతాన్ని, సంస్కృతిని ప్రజాసముదాయానికి అందజేసే మరొక సంస్థ అవసరం ఏర్పడింది. ఆనాడు తెలుగు భాషకు విద్యా వ్యవస్థలోగాని పరిపాలనా వ్యవస్థలోగాని ఎటువంటి స్థానము లేకుండేది. అంతేకాదు తెలంగాణలో తెలుగుభాష దీవము(దివ్వె) పూర్తిగా ఆర్పివేయడమే అప్పటి ప్రభుత్వ విధానముగా ఉండెను. అక్కడక్కడ ప్రమిదలలో మినుకు మినుకుమను చమురు దీపాలవలె తెలుగు సాహితి, సంస్కృతులు పల్లెపట్టులలో ప్రకాశించినప్పటికిని కాంతిని మరింత ప్రకాశించునట్లు చేయుటకు ఒక సంస్థ అవసరము ఉండెను.

1948లో తొమ్మిదవ ఆంధ్రమహాసభ వరంగల్లు సమీపంలో ధర్మవరమున జరుగుచున్నప్పుడు కొందరు యువకార్యకర్తలు, సాహిత్యప్రియులు, రచయితలు సమావేశపరచుకొని ఈ విషయమును ప్రస్తావించుకొన్నారు. కాని అప్పటి రాజకీయాలకు ప్రాధాన్యం ఉండడం వలన ఈ ప్రయత్నమునకు ఆటంకము ఏర్పడినది.

1943లో హైదరాబాదు నగరంలో దశమాంధ్ర మహసభలు జరుగుచున్నప్పుడు మరల ఇందుకోసం ప్రయత్నం చేయబడినది. ఈ ప్రయత్నంలో శ్రీబూర్గుల రంగనాథరావు, కీ।।శే।। భాస్కరభట్ల కృష్ణారావుగారు సమావేశకర్తలుగా 26 మే 1943న రెడ్డివసతి గృహము గ్రంథాలయములో ప్రథమ సమావేశము జరిగినది. ప్రముఖులైన ఆంధ్రభాషాభిమానులు కవిపండితులు ఇందులో పాల్గొన్నారు. ఈ సమావేశమునకు కీ।।శే।। లోకనంది శంకరనారా యణరావుగారు అధ్యక్షత వహించారు. అన్ని విషయములను కులంకషముగా చర్చించబడినవి. ఆంధ్రభాషా సంస్కృతుల ప్రచారము ప్రధాన లక్ష్యముగా ఒక సాహిత్య సంస్థను స్థాపించుటకు నిర్ణయము జరిగినది. దాని పేరును గూర్చి తర్జన భర్జనలు జరిగినవి. అప్పటి వరకే "హైదరాబాద్ ఆంధ్ర సాహిత్య పరిషత్తు అను ఒక సంస్థ ఉండేది. రాష్ట్రంలోని వారు ఇతరులు కలిసి ఎట్టి ఉద్యమములు కొనసాగించరాదని ప్రభుత్వము నిషేధము విధించినందువలన ఆ సంస్థకు నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు అని నామకరణము చేశారు.

దైవానుగ్రహమున 1948లో హైదరాబాద్ పై పోలీసుచర్య జరిగి నైజాం నిరంకుశ పాలన అంతరించెను. ఆనాడు తాత్కాలికముగా సైనిక ప్రభుత్వం ఏర్పడినది. దేశీయులలో కలిగిన ఉత్సాహ ఫలితముగా పరిషత్తుకు విధించిన ఆంక్షలు అన్ని తొలగిపోయినవి. పరిమితమైన






పరిషత్తు కార్యకలాపాలు సకలాంధ్ర దేశమున విస్తరించెను. నిజాం ప్రభుత్వపు అడ్డుగోడలు కూలిపోవుటవలన పరిషత్తు పేరు నుండి నిజాం రాష్ట్ర పదము తొలగింపబడి ఆంధ్ర సారస్వత పరిషత్తుగా మారింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వుంటూనే పరిషత్తు బహుముఖాన కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకున్నది. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం కోసం జరిగిన ఉద్యమాలతో ఆ

స్వప్నం 2014 జూన్ 2వ తేదిన సాకారమై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఈ ఆవిర్భావంతో పరిషత్తు పేరులో కొంత మార్పు చేశారు. ఆంధ్ర పదము తొలగించి **"తెలంగాణ సారస్వత పరిషత్తు"**గా మార్పు చేశారు. దీనికి ప్రస్తుతం అధ్యక్షులుగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కేవీ రమణాచారిగారు, ప్రధాన కార్యదర్శిగా డా।। జె. చెన్నయ్యగారు సేవలను అందిస్తున్నారు.

తెలుగు భాష పరిరక్షణకు పరిషత్తు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా పరీక్షల నిర్వహణ, వయోజన విద్యాకేంద్రాలు, గ్రంథాలయపఠనాలయములు, పుస్తక విక్రయశాల తెలుగు పండితశిక్షణ కళాశాల, ప్రాచ్య కళాశాల, పుస్తక ప్రచురణలు, సదస్సులు సమావేశములు మొదలగు ఎన్నోఎన్నెన్నో కార్యక్రమములు నిర్వహించు చున్నారు. ఈ నా పరిశోధన పత్రములలో విద్యా సంస్థలనుగురించి తెలియజేస్తున్నారు.

### పరీక్షలు:

తెలుగు భాష వ్యాప్తికి పరిషత్తు చేపట్టిన కార్యక్రమాలలో పరీక్షల నిర్వహణ ఒకటి.

నిజాం పరిపాలనలో గ్రామాలయందు విద్యాశాలలు లేకుండెను. తాలూకా కేంద్రము లలో ఒక మాధ్యమిక పాఠశాల ఉన్న అది ఉర్దూ బోధన భాష ఉండేది. ఆ పరిస్థితిని పోగొట్టుటకు దేశీయులలో మార్పు భాషాజ్ఞానము పెంచుటకు ఆ బాధ్యతను పరిషత్తు స్వీకరిస్తూ వచ్చింది. దాని కోసం పరీక్షల ప్రణాళికను సిద్ధం చేసుకొని ఉప సంఘములో ఉంచారు. అందు శ్రీమదిరెడ్డి హనుమంతరావునాయుడు, శ్రీ ఆదిరాజు వీరభద్రరావు పంతులు, శ్రీ లోకనంది శంకరనారాయణరావు, శ్రీ బిరుదు వెంకటశేషయ్యగారలు సభ్యులుగా ఉండి మొదట ప్రవేశ పరీక్షా ప్రణాళికను సిద్ధము చేశారు.

18-19 జూలై 1944 తేదీలలో మొట్టమొదటిసారి పరిషత్తు ప్రవేశపరీక్ష హైదరాబాదు, అలియాబాదు, దర్వాజా, వరంగల్లు, ఖమ్మం, కరీంనగర్, శంకరంపేట, చిన్న పెండ్యాల,మహబూబాబాద్ కేంద్రముల యందు జరుపబడినవి. ఈ పరీక్షలు అన్నీ కూడా ప్రవేశపరీక్షలుగా ఉండి ఆ ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణులు అయినవారికి ప్రవేశం లభించేది. అలా ప్రవేశం పొందిన వారు ప్రాథమిక విద్యను, మాధ్యమక విద్యను, విశారద పూర్వభాగ విద్యను, విశారద ఉత్తరభాగ విద్యను అభ్యసించేవారు. పరిషత్తు ప్రాథమిక పరీక్ష ఎలిమెంటరీ స్థాయిలో, మాధ్యమిక పరీక్ష మిడిల్ స్థాయిలో, ప్రవేశ పరీక్ష మెట్రిక్స్ స్థాయిలో ఉండునట్లు, ఉన్నత స్థాయిలో విశారద పూర్వభాగ మరియు విశారద ఉత్తర బాగా పరీక్షలు ఉండేవి. ఈ ప్రయత్నము వలన అప్పటి హైదరాబాదు ప్రభుత్వము ప్రవేశపరీక్షను కొన్ని షరతులతో ఆమోదించెను. దాని ఫలితముగా ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా నియమించుకొనేవారు. దీని కారణంగా తెలుగు ప్రాథమిక పాఠశాలకు తెలుగు బోధించు ఉపాధ్యాయుల కొరత లేకుండ పోయినది. తరువాత విశారద పరీక్ష కూడ ప్రభుత్వామోదము పొందెను. ఇప్పటి వరకు ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులై వేలకొలది మంది తెలుగు అధ్యాపకులుగా ఉద్యోగాలు సంపాదించుకున్నారు.

### వయోజన విద్యా ప్రచారము: -

తెలుగు పరీక్షలతో బాటు వయోజన విద్యావ్యాప్తికి గూడ పరిషత్తు కృషి చేసినది. 1950 సంవత్సరమున జబల్పూర్లో జరిగిన వయోజన విద్యా సదస్సులో పరిషత్తు ప్రతినిధులు పాల్గొని ఆ విషయము ఆకలింపు చేసుకొని వచ్చారు. 1950 సంవత్సరము జూన్ 15వ తేది నుండి 30వ తేది వరకు పరిషత్తు పక్షమున హైదరాబాద్లో వయోజన విద్యా శిక్షణ కేంద్రము నిర్వహింపబడెను.

ఈ కేంద్రమునకు ప్రిన్సిపాలుగా సుప్రసిద్ధ విద్యావేత్త శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు పనిచేశారు.

తెలుగు దేశమునందలి అన్ని మండలముల నుండి విద్యార్థులు పాల్గొని శిక్షణ పొందినారు. పరిషత్తు తరుపున తెలంగాణ అంతయు వయోజన విద్యా వారముగా 1951 ఫిబ్రవరి 17 తేది నుండి 21వతేది వరకు జరుపబడినది. తరువాత ప్రభుత్వ సహకారముతో పరిషత్తు హైదరాబాద్ నగరమున 11 సాంఘిక విద్యాకేంద్రములను, తెలంగాణ జిల్లాలలో 64 వయోజన రాత్రి పాఠశాలలను నడిపినది. సింగరేణి

బొగ్గు గనుల కార్మికుల కొరకు కొత్తగూడెం, ఇల్లెందు, బెల్లంపల్లి మొదలైన ప్రాంతాలలో 16 వయోజన పాఠశాలలు నిర్వహించారు. వేల సంఖ్యలో వయోజనులు పాల్గొని అక్షరాస్యులగుటయేగాక పరిషత్తు పరీక్షలలో ఉత్తీర్ణులైనారు.

### తెలుగు పండిత శిక్షణ కళాశాల: -

తెలుగు పండితుల కోసం పరిషత్తు ఒక శిక్షణ కళాశాలను నిర్వహించినది. శిక్షణ పొందిన వారు తెలుగు పండితులుగా ఉద్యోగాలు సంపాదించుకొని, ఉద్యోగాల్లో ఉన్నతిని సాధించారు. ఈ పండిత శిక్షణ కార్యక్రమం ఎందరికో సహాయపడింది. ప్రభుత్వము నిర్వహించు తెలుగు పండితుల శిక్షణ కళాశాలలో పరిషత్తు విశారద పరీక్షలలో ఉత్తీర్ణులైన వారిని స్వీకరింప నందున చాలా ఇబ్బందులు పడేవారు. అందుకు ప్రయత్నించి హైదరాబాదు నగరమున పరిషత్తు భవనములో పండిత శిక్షణ కళాశాలను ప్రారంభించి విశారద వారికి శిక్షణ ఇచ్చుటకు ప్రభుత్వ అనుమతిని పొందుడం జరిగింది. 22/10/1964 తేదీన తెలుగు పండిత శిక్షణ తరగతుల ప్రారంభోత్సవము జరిగింది. సంవత్సరమునకు రెండు తడవులుగా స్వల్పకాలిక శిక్షణ ప్రణాళికతో ఈ శిక్షణ తరగతులు నిర్వహింపబడినవి. ఆంధ్రదేశము నందలి అన్ని జిల్లాల వారు రాష్ట్రేతర ప్రాంతాల వారు వచ్చి ఈ శిక్షణ పొందేవారు. పరిషత్తు విశారద పరీక్షతోపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం డిప్లొమా ఓరియెంటల్ తెలుగు ఉత్తీర్ణులైన వారిని కూడా ఈ కళాశాలలో చేర్చుకొని శిక్షణ ఇచ్చేవారు. 1976 సంవత్సరము వరకు ఈ కళాశాల నడిపించిన మధ్య కొన్ని సంవత్సరాలు ఆపివేయబడింది. చాలామంది కోరిక మేరకు తిరిగి తేదీ 11 ఆగస్టు 1990 నుండి నడపబడినది మరియు ప్రస్తుతము తెలుగు పండిత శిక్షణను తెలంగాణా రాష్ట్రంలో 2017 నుండి నిలిపివేయడం జరిగినది. ఇప్పుడు ఈ కోర్సు లేదు.

### ప్రాచ్య కళాశాల: -

ఉస్మానియా విశ్వ విద్యాలయము వారు పరిషత్తు విశారద పరీక్షను తమ ప్రాచ్య భాషల ఎంట్రెన్సు పరీక్షతో సమానముగా పరిగణించి ఆ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు ఏప్రాంతము వారైనను నిరభ్యంతరముగా తమ డిప్.ఓ.యల్ పరీక్షలో పాల్గొనుటకు అనుమతించి తోడ్పడిరి. విశారదలో

నెగ్గిన అభ్యర్థులు ప్రాచ్య భాషా పట్టములు పొంది విశేష ప్రయోజనము పొందవలెనను ఉద్దేశముతో పరిషత్తు భవనములలో 15-1-1965 తేదిన సాయం ప్రాచ్య కళాశాల ప్రారంభించబడినది.

27-8-1965 తేదిన పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రారంభోత్సవము శ్రీ నూకల సరోత్తమరెడ్డి గారి అధ్యక్షతన జరిగినది. ప్రసిద్ద పండితులైన వారు అధ్యాపకులుగా ప్రతి ఫలము గ్రహింపక పనిచేసి కళాశాల స్థిరత్వమునకు తోడ్పడినారు.

ప్రభుత్వము నుండి కళాశాలలకు గ్రాంటు లభించు వరకును పరిషత్తు అన్ని వ్యయములను భరించి నిర్వహించినది. ప్రస్తుతము ప్రభుత్వ సహాయము లభించుచున్నది. ఈ కళాశాలలో డిప్.ఓ.యల్, బి.ఓ.యల్, యం.ఓ.యల్ పరీక్షలకు తరగతులు నడుపుచున్నవి. ప్రతి సంవత్సరం స్త్రీలు, పురుషులు 200 వరకు విద్యార్థులు చదువుకుంటు న్నారు.

2014 తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తుకు తెలంగాణ సారస్వత పరిషత్తుగా పేరు మార్పు చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ద్వారా 33 జిల్లాల సమగ్ర స్వరూపం పుస్తకాలను వెలువరించే ప్రయత్నం చేస్తున్న తరుణంలో జోగులాంబ గద్వాల జిల్లా మొట్టమొదటిగా జిల్లా సమగ్ర స్వరూపమును వెలువరించారు. అదే పరంపరలో నాగర్ కర్నూల్ జిల్లా సమగ్ర స్వరూపం, అదిలాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం, మంచిర్యాల జిల్లా సమగ్ర స్వరూపం, హనుమకొండ జిల్లా సమగ్ర స్వరూపం, వనపర్తి జిల్లా సమగ్ర స్వరూపం, రాజన్న సిరిసిల్ల జిల్లా సమగ్ర స్వరూపం, నిజాంబాద్ జిల్లా సమగ్ర స్వరూపం, మహబూబ్నగర్ జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకాలను వెలువరించడం జరిగింది. ఇంకా పలు సమగ్ర స్వరూపాల పుస్తకాలు రావాల్సి ఉన్నవి. వీటితోపాటు పరిషత్తు సభలు,సమావేశాలు,శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తూ సాహిత్య సేవలో తెలంగాణ సారస్వత పరిషత్తు అగ్రభాగంలో నిలుస్తున్నది.

తెలంగాణ సారస్వత పరిషత్తు ఏదో ఒక ప్రత్యేకమైన సాహిత్య సిద్ధాంతానికి కట్టుబడిన

సంస్థ కాదు. భిన్న సాహిత్య సిద్ధాంతాల్లోని మంచిని గ్రహిస్తూ సమన్వయ దృష్టితో భాషా సాహిత్యాల వికాసం కోసం కృషి చేస్తూ, వివిధ కార్యక్రమాలను పరిషత్తు ప్రాంగణంతో పాటు ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలు మరియు రాష్ట్రేతర ప్రాంతాలు, విదేశాలతో కూడ నిర్వహిస్తూ తెలుగువారి సంస్కృతిని ప్రజలకు తెలియజేస్తున్న ఏకైక సంస్థ తెలంగాణా సారస్వత పరిషత్తు.

పరిషత్తు యొక్క విశిష్ట సేవలను ప్రజలు, ప్రభుత్వం గుర్తించి అన్ని విధాలుగా దానిని ఆదుకొని అభివృద్ధికి కృషి చేయాలని ఆశిద్దాం.

***(26/05/1943 - 26/05/2023) తెలంగాణ సారస్వత పరిషత్తు 80 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా...)***

-డా.మంగళగిరి శ్రీనివాసులు
9491388662.

# కవి అనేవాడు తనను తాను ఆవిష్కరించుకోవాలి - జయంత్ మహాపాత్ర




జీవన సారాంశాన్ని చెప్పాలి. కవి అనే వాడు తన కవిత్వం లో తన శక్తిమేరకు జీవన గమనాన్ని నిజాయితీగానూ కళాత్మకం గానూ చెప్పగలగాలి.

జయంత్ మహాపాత్ర కవిత్వం గాఢమైన జీవితానుభవంలాగా చాలా సాంద్రంగా సాగుతుంది.

ఆయన్ని స్థానిక పాబ్లో నెరూడా గా పిలుస్తారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన భారతీయ ఆంగ్ల కవుల్లో ప్రముఖుడయిన జయంత్ మహాపాత్ర ఒక చోట ఇట్లా అంటాడు " నేను ఒక కవిత రాయాలనుకున్నప్పుడు ఒక ప్రతీక తో ఆరంభిస్తాను, లేదా కొన్ని ప్రతీకలతో ఆరంభిస్తాను. అవి ఒకటి నుంచి మరొకటి దాన్నుంచి మరోటి అట్లా ఏర్పడుతూ పోతాయి. ఆ కవిత ఎట్లా ముందుకు సాగుతుందో తెలీదు..ఎట్లా ముగుస్తుందో కూడా తెలీదు'.

జయంత్ మహాపాత్ర కవిత్వం నిండా ఒడిశా ప్రజల ప్రాచీన సంస్కృతి, వర్తమాన చరిత్ర అన్నీ పరుచుకుని వుంటాయి. అట్లని ఆయన్ని స్థానిక కవిగా భావిస్తే తప్పే అవుతుంది.

ఆయన కవిత్వం స్థానీయత నుండి విశ్వజనీనమయిన భావన వైపునకు,ఒడిశా ప్రాంతీయత నుండి ప్రపంచ వ్యాప్త దృష్టి కోణాన్ని ఆయన తన కవితల్లో ఆవిష్కరించాడు.




ఆయన కవిత్వం ప్రపంచ ద్వారాల్ని ఒడుపుగా తెరుస్తుంది.

2 అక్టోబర్ 1928 కటక్ లో జన్మించిన జయంత్ మహాపాత్ర కింది మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడు. తన ప్రాథమిక విద్య కటక్ లోని స్టీవర్ట్ స్కూలులో జరిగింది. చిన్నప్పటినుండీ ఆంగ్ల మాధ్యంలో చదువుకున్న ఆయన సైన్స్ బాగా ఉత్సాహంగా ఆసక్తిగా చదువుకున్నాడు. భౌతిక శాస్త్రం లో పీజీ ప్రథమ శ్రేణిలో పాసయి, శాస్త్రవేత్తగా శిక్షణ పొందాడు. కాలేజీ టీచర్ గా తన వృత్తి జీవితం ప్రారంభించాడు. ఒడిశా లోని పలు కాలేజీల్లో ముప్పయి ఆరేళ్ళ పాటు భౌతిక శాస్త్ర అధ్యాపకుడిగా పని చేసాడు. గంగాధర్ మెహర్ కాలేజ్ సంబల్ పూర్, బి.జే.బి కాలేజి, భువనేశ్వర్,ఫకీర్ మోహన్ కాలేజి బాలాసోర్, రావెన్ షా కాలేజ్,కటక్ లాంటి అనేక కాలేజీల్లో పని చేసాడు. చిన్నప్పటినుండీ ఎప్పుడూ కవిత్వం రాయాలని కవి ని కావాలని ఆయన అనుకోలేదు. చాలా మంది కవుల కంటే భిన్నంగా జయంత్ మహాపాత్ర తన 38 వ ఏట కవిత్వం రాయం మొదలు పెట్టాడు. ఆయన ఇంగ్లీష్, ఒడియా రెండు భాషల్లో విరివిగా రాసాడు. భారతీయ ఆంగ్ల కవిగా ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించాడు.

ఆయన మొట్టమొదటి పుస్తకం "CLOSE THE SKY , TEN BY TEN"1970 లో అచ్చు అయింది. అప్పటిదాకా భౌతిక శాస్త్రం భోదిస్తూ ఉన్నప్పటికీ, ఆయనకు నవలలు కథలు బాగా ఇష్టంగా ఉండేవి. అందులోనూ ఇంగ్లీష్ వచనం బాగా చదివాడు. కానీ ఎప్పుడూ కవి అవుతానని అనుకోలేదు. కాని కవిత్వంలోకి గుడ్డిగా వచ్చేసాడు.. ఎటు పోతున్నాడో తెలీని స్థితి.. కవిత్వ తొలి రోజుల్లో ఆయన కవిత్వం నిండా స్వీయ స్పృహ అధికంగా కనిపిస్తుంది. అయితే **'కవిగా మొదటి రోజుల్లో పడిపోయాను, లేచాను, ఎదిగాను'** అంటాడు మహాపాత్ర. బహుశా అప్పటిదాకా ఆయనలోనో నిబిడీకృతమయివున్న కవితాంశ, భావావేశం, సృజనాత్మత పెల్లుబికి కవిత్వంగా రూపుదిద్దుకుందేమో అనిపిస్తుంది. ఆయన రాయకుండా తన భావాల్ని చెప్పకుండా ఉండలేని స్థితికి గురయి విస్తృతంగా రాసాడు. రెండు భాషల్లో రెండు చేతులతో రాసాడనే చెప్పాలి. ఆయన విస్తృతంగా చదివాడు. అట్లా చదవడం వల్లనే తనకు భాష వొంటబట్టింది. ఆ భాషను కవిత్వం లో వాడాడు. చిన్నప్పటి నుండీ మిషనరీ స్కూల్స్ లో చదవడం వాళ్ళ ఆయనకు ఇంగ్లీష్ స్వభావ సిద్ధంగానే వచ్చింది. ఒడియానే తనకు సెకండ్ లాంగ్వేజ్ గా నిలిచింది. అయినా ఆయన చుట్టూ వున్నది ఒడియా భాష అక్కడి ప్రజలు. వారితో మమేకం అయివుండడంతో ఆయన రచనల్లో ఆ జీవితం ఆ భాష ప్రభావం అమితంగా వుంది. తాను నివసించిన ఒడిశా ప్రాంత చరిత్ర సంస్కృతి ఆయన్ని తీవ్రంగా ప్రభావితం చేసాయి. మహాపాత్ర ఇంగ్లీషు కవిత్వంలో ధ్వనించే లయ మిగతా బయటి దేశాల ఇంగ్లీష్ భాషా



సాహితీ స్రవంతి
-వారాల ఆనంద్
9440501281

కవులకంటే భిన్నంగా వుంటుంది. దానికి ప్రదానంగా ఆయన పైన వున్న ఒడిశా లోని మౌఖిక సాహిత్యం, జానపద గీతాలు అనే చెప్పాలి.

జయంత్ మహాపాత్ర కవితా సంకలనం 'ఏ రెయిన్ ఆఫ్ లైఫ్' కవితలన్నీ బ్రిటన్ లోని క్రిటికల్ క్వార్టర్లీ, టి.ఎల్.ఎస్. లాంటి వాటిల్లోనూ, చికాగో రివ్యూ లాంటి పత్రికల్లోనూ అచ్చయ్యాయి. అంతేకాదు అమెరికా, ఆస్ట్రేలియాలలోని సాహిత్య పత్రికల్లో కూడా వచ్చాయి. దాంతో ఆ పుస్తకానికి జాకోబ్ గ్లాట్ స్టైన్ అవార్డు వెతుక్కుంటూ వచ్చింది.

జయంత్ మహాపాత్ర ఇప్పటికి 30 కి పైగా కవితా సంకలనాలు వెలువరించారు. అందులో అధికంగా ఇంగ్లీష్ లోనూ మిగతావి ఒరియాలోనూ రాసారు.

జయంత్ మహాపాత్ర ప్రధానంగా కవిత్వం రాసినప్పటికీ వచనం కూడా రాసారు. దొర్ ఆఫ్ పేపర్స్ కథా సంకలనం, అనేక వ్యాసాలూ, తన జ్ఞాపకాలూ రాసారు. అంతేకాదు జయంత్ మహాపాత్ర అనేక ఒడియా కవితల్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అనువాదకుడిగా కూడా ఆయనకు గొప్ప గౌరవముంది.

> **కవి అనేవాడు తన కవిత్వం లో తన శక్తిమేరకు జీవన గమనాన్ని నిజాయితీగానూ కళాత్మకంగానూ చెప్పగలగాలి**

ఆయన కవితా సంకలనం 'రిలేషన్ షిప్స్' కి 1981 లో సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. దాంతో ఆయన మొట్టమొదటి భారతీయ ఆంగ్ల కవిగా ఆ అవార్డును అందుకున్నాడు. చికాగో పోయెట్రీ మాగ్జైన్ నుండి జాకోబ్ గ్లాట్ స్టయిన్ పురస్కారం, అల్లెన్ టా టే అవార్డును ద సెవానీ రివ్యు నుండి, సార్క్ లిటరరీ అవార్డు, టాటా లిటరేచర్ జీవన సాఫల్య పురస్కారంఅందుకున్నారు. ఇంకా 2009 లో పద్మశ్రీ పురస్కారం, ఉత్కల్ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, సాహిత్య అకాడెమీ ఫెల్లోషిప్ కూడా అందుకున్నారు. ఫెల్లోషిప్ ను అందుకున్న మొట్ట మొదటి భారతీయ ఆంగ్ల కవి కూడా జయంత్ మహాపాత్ర నే. అంతే కాదు అనేక జాతీయ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో కవిత్వ పఠనాల్లో పాల్గొన్నారు.

**'కవి తనకు తాను వేసుకునే అనేక ప్రశ్నలకు, తాను రాసే కవిత్వం సమాధానాలు చెబుతుంది'** అంటాడు జయంత్ మహాపాత్ర.

అందుకే ఆయన కవిత్వం ఆయనకు తన అంతర్ బహిర్ సంఘర్షణలకు వేదికగా నిల్చింది. ఆయన రాసిన కవిత్వం ఆయనకే కాదు చదువరులు తాము ఎదుర్కొనే అనేక ప్రశ్నలకు కూడా వెతికితే సమాధానాలు లభిస్తాయి.

ఆయన్ని చదివిన తర్వాత నా అనుభవం చెబుతున్న సత్యమిది.

ఎవరికయినా చదవడం రాయడం ఒక మంత్రం లా పని చేస్తుంది. అది ఆ పాఠకుడిలో వున్న అనేక అనేక బాధలకు, సంక్షోభాలకు తెరిపినిస్తుంది. అందులో ముఖ్యంగా రాయడం వలన కవిలో పెల్లుబికిన ఉద్వేగం కాగితం మీదికి ఒలికి అతను అతని మనసు నిమ్మలమవుతుంది. జయంత్ మహాపాత్ర కవిత్వం కూడా అంతే ఆయన కూడా అంతే.. రాస్తూ తాను ఎంతో ఉపశమనం పొందుతానని అంటాడు.

**'కవి తాను స్వేచ్ఛగా రాయాలి, తన అవగాహనకు స్థాయికి అనుగుణంగా రాయాలి. ప్రేమ కవి, కమర్షియల్ కవి అంటూ కాకుండా కవి అనేవాడు తప్పకుండా తనను తాను ఆవిష్కరించుకోవాలి.. ఎలాంటి భేషజాలు, లేకుండా తాను భావించిన విషయాలు, తాను అనుకున్న సత్యాలు తాను చూసిన లేదా అనుభవించిన వాటిని తన కవిత్వంలో నిజయితీగా ప్రతిఫలింప జేయాలి'** అంటాడు జయంత్.

**'కవి అనేవాడు తన కవిత్వం తో నీతివంత మయిన ప్రవర్తనకు సంరక్షకుడిగా వుండాలి. కవిత్వం అలాంటి స్థితి సృష్టించ లేనప్పుడు ప్రపంచ మనుగడే ప్రశ్నార్థక మవుతుంది'** అంటాడు జయంత్ మహాపాత్ర.

కవి ఒంటరిగా ఒంటరితనంలో కూర్చుని రాయలేడు, అట్లా చేస్తే స్తబ్దత, ఎడారితనం కవిని చుట్టుముడుతాయి. అందుకే తన చుట్టూ జరుగుతున్న విషయాల్ని పట్టించుకోకుండా ఉండలేడు. కవి తన వేదనని భావోద్వేగాన్ని గూర్చే రాస్తాడు. కవిత్వం కవి అంతర్ బహిర్ సంభాషణ నుంచే పుడుతుంది అంటాడు. అంతేకాదు కవిత్వం వర్తమాన కాలపు సంక్షోభాన్నీ, దుఖాన్ని ప్రతిబించాలంటాడు.

**"నేను ఒడిశా లో పుట్టాను, ఇక్కడే బతికాను బతుకుతున్నాను, ఇక్కడి చరిత్ర నాది, కోణార్క్ నాది, కోణార్క్ వైశాల్యం నాది, వైభవం నాది, దాని ఒంటరితనం నాది.. అంతే కాదు ఇక్కడి ఆకలి.. ఇక్కడి కరువు కాటకాలు నావి.. ఎవరయినా వాటిని దాటి నా నుంచి మరే రచనల్ని ఆశిస్తారు.. నేను అదే రాసాను.. రాస్తున్నాను..చెట్టు మీద మామిడి ఎట్లా పండి పోతుందో నేనూ అట్లే మరణం వైపు పరి పక్వం చెందుతున్నాను"** అంటాడు జయంత్ మహాపాత్ర.

ఆయన కవిత్వంలో కాలం ముఖ్య భూమికను పోషిస్తుంది. ఆయన కాలంతో పాటు సమాంతరంగా సాగాడు. కాలం ఆయన కవిత్వం లో ముందుకు వెనక్కు కదులూ వుంటుంది.

ఆయన కవిత్వం నిండా నాస్టాల్జియా కనిపిస్తుంది.

'రాస్తున్నప్పుడు నిన్ను నువ్వు కోల్పోతావు ... ఒక్కోసారి కవిత్వం గతాన్ని స్తుతిస్తుంది' అని కూడా ఆయనంటాడు.

ఇట్లా భౌతిక శాస్త్రం చదువుకుని బోధించి కవితా ప్రపంచంలోకి ఆలస్యంగా వచ్చినప్పటికీ స్పష్టమయిన అభిప్రాయాలతో అందమయిన స్థానీయమయిన ప్రతీకలతో గొప్ప కవిత్వాన్ని రాసి ప్రపంచ వ్యాప్తంగా పేరు గడించిన జయంత్ మహాపాత్ర ఈ కాలపు మహా కవిగా మన్ననల్ని అందుకున్నాడు. ఒక కవి అలుపెరుగ కుండా సీరియస్ గా కవిత్వం రాస్తూ వుంటే అవార్డులు రివార్డులు అతన్ని వెతుక్కుంటూ వస్తాయి అదే క్రమంలో జయంత్ మహాపాత్రకు అనేక అవార్డులు మన్ననలు వచ్చాయి.

జయంత్ మహాపాత్ర కటక్ కీ, మహానదీ తీరానికీ, ఒడియా నేలకీ జీవితమంతా అంటి పెట్టుకుపోయాడు. ఆ విషయంలో రామానుజన్ కన్నా, పార్థసారథికన్నా దిలీప్ చిత్రేకన్నా తనెంతో అదృష్టవంతుణ్ణని చెప్పుకుంటాడు. ఇప్పుడు తన ఆత్మకథ మాత్రం ఒడియాలో రాస్తున్నాడు

### ఒక వేసవి కవిత

ఊళ పెడుతున్న దిగులుగాలిలో
మరింత గట్టిగా వినిపిస్తున్న
పూజారులమంత్రాలు.
భారతదేశపు నోరు తెరుచుకుంటోంది.
మొసళ్ళు మరింతలోతుల్లోకి జరుగుతున్నాయి.
మండుతున్న పేదపిడకల ప్రభాతాల
పొగ ఎండలో.
బారెడు పొద్దెక్కినా
నా ధర్మపత్ని ఇంకా
నా శయ్యలో
కలలు కంటూనే ఉంది
చితిమంటలపెళపెళలకు
సొలసిపోని స్వప్నాలతో.
దేవాలయం వీథి, పూరి
మట్టిలాగా జేగురురంగు పిల్లలు




వికలాంగుల్నీ, వీథికుక్కల్నీ
చూసి నవ్వుతున్నారు
వాళ్ళనెవరూ పట్టించుకుంటారన్న బాధ లేదు.
అనంతలయోన్ముఖం దేవాలయం .
నున్నగా గొరిగినగుండురంగు వీథిదుమ్ములో
అన్నీ నిరంతరం సంచరిస్తూనే వుంటాయి
కాని ఏ ఒక్కటీ దృష్టిపథం దాటిపోదు.
ఇక అక్కడ ఆ ఆకాశం
ఉల్లంఘించలేని ఏ అధికారానికో
కట్టుబడి నిశ్శబ్దపు చంకకర్రలు సాయంగా.
రేపటికోసమొక ఆశతో
పూరిలో కాకులు
విశాలమైన ఆ ఒక్క వీథి
రాక్షసినాలుకలాగ సోమరిగా.
అటుపోతున్న పూజారికోసం
దారితొలుగుతున్న
అనామకులు ఐదుగురు కుష్టువాళ్ళు .
వీథి చివర దేవాలయద్వారం
దగ్గర తోసుకుపడుతున్న
మనుష్యసందోహం.
మహోన్నతకారణాలగాలిలో
తలూపుతున్న
బృహత్ పవిత్రపుష్పం.



## కలం బలం...!

కలముబలముచూడు కావ్యగ్రంథపురాశి
పద్యవచనరచన పాళితోడ
వివిధ ప్రక్రియలన్ని విస్తృతమొనరించి
వాణికంఠమందు వాసికెక్కె!

కథలు కవితలన్ని కడు యింపురచనలు
వాస్తవికప్రజల వాణులన్ని
పూసగుచ్చినట్లు పూమాలరీతిగ
కూర్చుగలదుకలము కుశలముగను!

పరమశ్రేష్ఠమైన ప్రముఖప్రబంధాల
శ్లేష కావ్య తతుల సేదదీర
పద్యపరిమళంబు ప్రభవించెసౌరభ
ములకు కలముబలమె మూలమయ్యె!

కవులకలముచేత కమనీయరచనలు
కావ్యకన్య గాను కదలసాగె
మధురగేయ రచన మంజీరనాదాలు
తెలుగుభాషకిలను తేజమిచ్చె!

నవరసములధార నవ్యతరంగమై
సకలకావ్యములలో సంగమించె
పతితమనములందు పరవశంబులనిచ్చి
తెలుగుభాషకిలను వెలుగులిచ్చె!

మాతృభాషలోనె మార్మిక కవితకు
పట్టమిలనుగట్టి ప్రాపుబెంచె
సకలకవులనెలువు సాకారరూపమై
వేనవేల కవన వేదికయ్యె!

భావకవితతోడ భాసించివెలుగొంది
ఎంకిపాటలందు యెదనుమీటె
దేశభక్తి కవిత తేజరిల్లంగను
స్మృతికవితతోడ స్ఫూర్తినొసగె!

మాండలికముతోడ మన్ననపొందియు
జానుతెనుగుగాను జాలువారె
కవులకలములకిల కడుభావములనిచ్చి
సరసకావ్యతతిని సన్నుతించె!

చతురమైనకవికి ఛందస్సునొసగెను
మాత్రఛందమలర మర్మమిచ్చి
తెలుగుసాహితికిల తెరచాపవోలెను
రసతరంగమందు రాటుదేలె!

వీణవాదనముకు యింపైనరాగమల్
వ్రేలికొసల తోడ వెలువరించి
శ్రోతమదులువినగ సొంపునింపు
ఆర్ద్రభావములతొ హాయినిచ్చు!

లాలిపాటజేత లాలిత్యమునొసగి
శిశువుపాలి తాను శిరములూపె
అమ్మగీత మందు
యపురూపబంధమై
జిలుగులీనె నాదు తెలుగుభాష!

యక్షగానమందు
యశమునేగూర్చెను
జానపదముతోడ జ్ఞానియయ్యె
పామరాదిప్రజల
పరవళ్ళగానాలు
తియ్యనైనగేయ తీపులిచ్చె!

కలములేకయున్న కావ్యంబులేవిల
తాళపత్రమందు దాచియున్న
ఘంటమయ్యు తాను
ఘనకీర్తిపొందెను
పద్య గద్యములకు ప్రాణికలము!



–డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## అమ్మకు శత కోటి వందనాలు

అమ్మే నా దైవం
అమ్మకు శతకోటి వందనాలు
అమ్మను మించిన ప్రేమ మరొకటి లేదు
అవనిలో దైవం లాంటి అమ్మ

అమ్మ ఒడిలోనే మన భాష
ప్రపంచానికి పరిచయం చేసేది అమ్మ

అమ్మ ను మించిన దైవం లేదు
ఆత్మగలఅమ్మ

అనురాగం ఆప్యాయత పంచే అమ్మ
అమ్మ కు గుండెల్లో గుడి కట్టాలి
అమ్మది ఆకాశమంతా ప్రేమ
సృష్టి కి అమ్మ మూలం

అమ్మా నేను ఎన్ని జన్మలెత్తినా
నీ ఋణం తీర్చలేను
ఓతల్లి నీజోల పాటే మధురం
అవనిలో అమ్మ ప్రేమే గొప్పది!!



–దేవులపల్లి రమేశ్
9963701294

## మనోరథం (కథ)

జయ ఎక్కడున్నావ్ రా తల్లి అని అమ్మ పిలుపు. పక్కింటి అత్త పిలిస్తే పోయినాను .ఇప్పుడే వస్తున్న అమ్మ అన్నది.నాయన బాయి దగ్గరికి పోయి స్నానం చేసి మడి నీళ్లు తెచ్చుకుంటడు. వంట పొయ్యి అలికి ముగ్గు పెట్టు అన్నది అమ్మ. సరే అంటూ జయ వంట పొయ్యి అలికింది శుభ్రంగా పెండతో .ముగ్గు పెట్టింది.

సూర్యోదయం కాకముందే నిద్రలేచి ఊడ్చి పెండ నీళ్లు చల్లి సుద్దతో ముత్యాల ముగ్గులు పెట్టి వాకిలిని అందంగా అలంకరించింది.

దేవుని సామాను కడిగింది అమ్మ. ఇంటికి పెద్దది కావడం వల్ల బిడ్డ జయ అమ్మకు పనుల్లో సాయం చేసేది.

జయ ఇల్లు అలికి ,చెల్లెళ్లకు స్నానం పోసి జెడలు వేసి బడికి పంపడానికి తయారు చేసేది.ఇద్దరు తమ్ముళ్లను కూడా ప్రేమగా చూసేది.తాను కూడా బడికి పోయేది.పదవతరగతి వరకు చదవగానే తెలిసిన సంబంధం వచ్చింది . బరువు దించుకోవాలని చిన్నపిల్లకే పెళ్ళి చేశారు.

అత్తగారింటికి పోయింది.చిన్నప్పటి నుండి అమ్మ దగ్గర పనులు నేర్చుకున్నందుకు అత్త గారింట్లో అన్ని పనులు చేస్తూ అందరితో శభాష్ అనిపించుకుంది.

తన ఈడు పిల్లలకు పెళ్లి కానేలేదు.దోస్తులందరు బాగా చదువుకుంటున్నారు. తన సంసారం బాగానే వుంది. అత్తగారింట్లో అందరూ బాగానే చూస్తున్నారు.కానీ మనసులో మాత్రం వెలితి. చదువుకోవాలన్న కోరిక అలాగే మిగిలిపోయింది.

ఇరవై ఏళ్లకే ఇద్దరు పిల్లలు పుట్టారు.ఏదో చిన్నపాటి ఉద్యోగం గల భర్త కిషోర్ కు.వాళ్ళ ఉన్న ఊరికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో వేరే ప్రాంతానికి వెళ్ళాలి.స్కూటర్ మీద వెళ్లి వచ్చేవాడు.పిల్లలను స్కూల్లో చేర్పించారు.ఉన్న ఊళ్ళోనే తెలుగు మీడియం. తెలివిగల పిల్లలు.చదువులో ఎప్పుడు మొదటి ర్యాంకే.

ఉన్నదాంట్లోనే హాయిగా వున్నారు. జయకు చదువు మీద ఆసక్తి అన్న విషయం గమనించిన కిషోర్ ఒకసారి పొద్దున్నే లేచి జయను పిలిచి మనం పట్నం పోదాం తొందరగా తయారు కావాలి అన్నాడు. ఇప్పుడెందుకు బావ అన్నది. ఏం లేదు నిన్ను ఎక్కడికి తీసుకుపోలేదు కదా అందుకని ఒకసారి పట్నం దారిలో శ్రీ వెంకరేశ్వర, సాయిబాబా గుడి పెద్దగా బాగుంటది.నీకు చూపించాలని అనుకున్న అనేసరికి జయ సంబరపడి పోయి ఇన్నేళ్లకు నన్ను బయటికి తీసుకుపోవాలని అనిపోయించినదా బావ అని ఉన్నదాంట్లోనే మంచి చీర కట్టుకుని పుత్తడి బొమ్మలా తయారైంది..భార్యను చూసి సంబరపడ్డాడు కిషోర్.

ఆరోజు లీవ్ పెట్టాడు.పిల్లలను బడికి పంపించి ఇద్దరు స్కూటర్ మీద పట్నం పోయినారు.చక్కగా ఒక డిగ్రీ కాలేజ్ ముందు ఆపిండు బండి.

గుడికి పోదాం అన్నవ్ కదా బావ ఇక్కడ కాలేజ్ కు తీసుకువచ్చినవ్ ఏంది అన్నది జయ.అవును విద్యాలయం అన్నాడు కిషోర్.లోపల ఆఫీసు గదికి పోయి ఓపెన్ డిగ్రీ చేయాలంటే ఎట్లా అని కనుక్కుని ఎలిజిబిలిటీ పరీక్ష రాయాలి అని తెలుసుకుని దరఖాస్తు ఫారం తీసుకుని వచ్చారు.

ఇంటికి వచ్చినాక చాలా సంతోషించి జయ భర్తకు కృతజ్ఞతలు తెలుపుకుంది.

అర్హత పరీక్ష రాసి ప్యానయి డిగ్రీలో చేరింది.ఆదివారం తరగతులకు హాజరయ్యేది.కిషోర్ ఇంట్లో పిల్లలను చూసుకునేవాడు.

పరీక్షల తేదీ వచ్చింది. చదువంటే ఇష్టం కాబట్టి ఇంట్లో పనులు చేసుకుంటూ పిల్లలు బడికి పోయాక ,రాత్రి పడుకున్నాక చదివేది.కష్టపడి శ్రద్ధగా చదివేది. పరీక్షల తేదీ వచ్చింది. తాను బి.ఏ సబ్జెక్టులన్ని చదివి పరీక్షలకు తయారైంది.పరీక్షలు బాగా రాసింది.

రోజులు గడుస్తున్నాయి.. రిజల్ట్స్ వచ్చాయి. ఉన్నత శ్రేణిలో పాస్ అయ్యింది.తర్వాత ఎం. ఏ చేసింది. రీసెర్చ్ చేసి పి. హెచ్.డి చేసింది.ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో అధ్యాపకురాలుగా ఉద్యోగం వచ్చింది. అనుకోకుండా తన కోరిక నెరవేరింది భర్త సహాయం వల్ల.పిల్లలు బాగానే చదువుకుంటున్నారు.

సంసారం హాయిగా సుఖంగా సాగుతుంది.మంచి బంగళా కొనుక్కున్నారు. ఎండాకాలం ఒకరోజు మంచంమీద పడుకుని ఆకాశం వైపు చూస్తూ ఆలోచనల్లో గతంలోకి వెళ్ళింది. చిన్నప్పుడే పెళ్లి చేస్తే స్నేహితులు ఎక్కిరించారు. అపుడే ముసలమ్మ అయింది అంటూ ఆట పట్టించారు.

భర్త మంచివాడు కాబట్టి స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగి జీవితంలో స్థిరపడిన ఆమెకు చిన్ననాటి జ్ఞాపకాలు మనోఫలకంపై కదలాడసాగాయి.

నాన్న కష్టపడి కుటుంబాన్ని పోషిస్తూ ఆడపిల్లను కాబట్టి తొందరగా పెళ్లి చేసి పంపించాడు.అయిన నా యోగం బాగుంది , కట్టుకున్న భర్త మంచివాడు,నా మనసు గ్రహించాడు కాబట్టి నలుగురిలో గొప్పగా ఎదిగాను అనుకుంటూ నిద్రలో జారుకుంది జయ.



–డా. చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

## నీ మాటే నీ సైన్యం

నీ మాటే నీ సైన్యం
నీ మాటే నీ భలగం బలం
మాట తో మంచి తనం
మనిషి తనం పరిమళిస్తుంది
మాట మనిషికి దేవుడిచ్చిన వరం
మాట కీ లాంటిది
కీతో లాక్ తీయొచ్చు మంచి మాటలతో
ఇతరుల హృదయాలను గెలువ వచ్చు
మాట తో ఇతరుల నోరు మూయించవచ్చు
మాటే నీ మంత్రము మాటే నీ సైన్యం
మాటే నీ ధైర్యం మాటే నీ ఆయుధం
మాటే నీ వృద్ధి అభివృద్ధి
మాటే నీ ప్రగతి పురోగతి
మాటే నీ మనో దర్పణం
మాటే నీ గుర్తింపు
మాటే తో నీ వ్యక్తిత్వవికాసం
మాటే మార్పుకు మార్గదర్శి
మంచి మాటల మల్లెలతో
మానవీయతను చాటుదాం
ఆత్మీయ అనుబంధాలను
అనురాగాల తో అలంకరిద్దాం
స్నేహ దీపాన్ని వెలిగిద్దాం
మాటల మమతల పూతోటలో
మరిచి పోని మరువలేని ఆప్యాయతలను ఆవిష్కరిద్దాం
సమత సహనం సంఘీభావం
సౌభ్రాతృత్వం సామరస్య సమరసత
పునాదుల మీద ప్రగతి శీల దృక్పథంతో
మెరుగైన సమాజానికి పునాది వేద్దాం
మాటే మానవ వికాసానికి చోదక శక్తి
అని చాటుదాం



–నేదునూరి కనకయ్య
9440245771

## కొత్త చరిత్రను లిఖించుకోవాలి..!

అనాదిగా
తగిలిన గాయాల తాలూకు
వ్రణాలు ఇంకా సలుపుతూనే వున్నాయి
రణాల నుంచే స్వేచ్ఛా గొంతుకలు
మారు మ్రోగుతాయి సుమా.

తగిలిన దేహాలకే మళ్లీ మళ్లీ
దెబ్బలు తగులుతున్న చందం
అనేకానేక అస్పృశ్యతా జాడల ఆనవాళ్లు

వర్ణం ఓ మాటే అనుకున్నం
మనిషినీ మానవత్వాన్నీ
నఖ శిఖం చీల్చే ఓ రాక్షస పంజా అది
ఏళ్లు గడిచినా ఇప్పటికీ మన మధ్యే
దర్జాగా
కాలుమీద కాలేసుకు కూర్చున్న
అసమాన వికృత చిత్రం
కొత్త రంగుల్ని
పులుముకుంటూనే వుంది
కొన్ని విత్తనాలు విత్తుకున్న పెత్తనాలు
డెబ్బైఐదు మెట్లెక్కిన వికటట్టహాసం
ఎంత వెగటుగా హృదయాలను
ఛిద్రం చేస్తుందో
ఆ సంఘటన దొర్లిన క్షణం
మనిషితనం
చిల్లు పడ్డ కుండయి పోయింది
కుండలో నీళ్లు సల్లగుంటయనుకున్నా
సవర్ణులకే అనుకోలేదు.

ఇలా వెల వెలా వేరుపడిపోయాక
ఆపధర్మ అలాయ్ బలాయ్‌లు
యెదనెంతగా గుచ్చుకుంటున్నాయో..
ఇంతటి ముసుగు మొఖంతో
ఇంతగా వెక్కిరించ బడుతున్న
నా నేల ముఖ చిత్రాన్ని
నేనెప్పటికీ ఆవిష్కరించుకోలేను

నా పాదముద్రలు మలినం కాక ముందే
ఈ నేలమీద ఈ గాలిమీద
ఈ నీరుమీద ఈ ఆకాశంమీద
భగ భగ మండే
నా హృదయాక్షరాల అగ్నిశిఖ మీద
కొత్త చరిత్ర లిఖించుకోవాలి..!



–డా. కటుకోఝ్వల రమేష్
9949083327

## అక్షర యుద్ధం

గుండెల్లోకి తీసుకెళ్లి మేధను
చిన్నాభిన్నం చేసి,
అగ్ని శిలలా విరుచుకుపడాలి.

ఇంటా బయటా జరిగే
అరాచకాల కోసం
అనుక్షణం అక్షర యుద్ధం చెయ్యాలి

ఆలోచనల ప్రవాహమై
అక్షర జల్లు కురిపించాలి....

వాక్యాలు భావ ప్రకంపనలై
మదిని మెలి పెట్టినప్పుడల్లా
నడతొక్కటే సమాధానమవ్వాలి.

పదాల చూపే
అక్రమాల విస్ఫోటనంతో
వెలుతురు సూర్యుడై
తరతరాలకి అక్షరాల వెలుగై
అఖండ జ్యోతిని వెలిగించాలి....

అప్పుడే అక్షరం మేధస్సుతో
యుద్ధం మొదలుపెడుతుంది



–ఎన్. లహరి
9885535506

పుస్తక సమీక్ష

# వాస్తవ సంఘటనలకు ప్రతీక "మానుషి" కథల సంపుటి






భారతీయ సమాజంలోని సంక్లిష్ట, సంకీర్ణ మానవ సంబంధాలను పాఠకులతో అలవోకగా చదివించడానికి రచయితలు కృషి చేస్తుంటారు. అలతి అలతి పదాలతో అందరికీ అర్థమయ్యే రీతిలో సమాజంలో జరుగుతున్న వాస్తవాలను కళ్ళకు కట్టినట్టుగా పాఠకులకు అందిస్తున్న రచయితలు అరుదుగా కనిపిస్తారు. ఆ కోవలో ముందు వరసలో ఉన్నవారు రచయిత్రి 'శాంతి శ్రీ బెనర్జీ' ఒకరు. ఈమె ఢిల్లీలో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కథలు, కవితలు, వ్యాసాలు రాస్తున్నారు. శాంతి శ్రీ బెనర్జీ కలం నుంచి వెలువడిన తొలి కథా సంపుటి "మానుషి".

"మానుషి" కథా సంపుటి లోని కథలన్నీ భిన్న వృత్తుల్లో, భిన్న పరిధిలో , భిన్న పరిస్థితుల్లో ఉన్న స్త్రీల జీవితాలు, అంతర్మథనాలు ,సమస్యలు, అనుభవాలు, జయపజయాలు, నిత్య సంఘర్షణలే వీటిలోని కథాంశాలుగా ఉన్నాయి. కవితా సంపుటిలోని మొత్తం 14 కథలన్నీ కూడా స్త్రీల కథలుగా, దాదాపు యదార్థ సంఘటనల ఆధారంగానే రచయిత్రి శాంతి శ్రీ బెనర్జీ రాసినవిగా ఉన్నాయి.

"మానుషి" కథా సంపుటిలోని ఎక్కువ కథలు మానవ సంబంధాలలో సరళత్వాన్ని, మారుతున్న విలువలను, మారవలసిన విలువలను ప్రతిపాదించేలా ఉన్నాయి . చాలా కథలు పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత మానవ సంబంధాలలో సంచనాలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ కథలు

చదువుతుంటే రచయిత్రి తమ స్వ అనుభవాల నుంచి ,ప్రత్యక్షంగా ,పరోక్షంగా చూసినవి, విన్న వాటి నుంచి స్పందించి రాసినవిగా ఉన్నాయి. కొన్ని కథలలో మనకు సామాన్య మానవుల జీవితాలలో నిత్యం జరుగుతున్న సంఘర్షణలు కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తాయి. స్త్రీ పురుష సంబంధాలు వాటి పరిణామాలే ఈ కథలో ప్రధాన వస్తువుగా ఉన్నాయి. కుమార్తెల నిర్ణయాలను అర్థం చేసుకొని ఆమోదించే తల్లులు ఈ కథల్లో కనిపిస్తారు. తమ నిర్ణయాలను అమ్మలకు చెప్పుకొని ఆమోదం పొందే కుమార్తెలు కూడా కనిపిస్తారు. భర్తలతో సంఘర్షించే భార్యలు కూడా కనిపిస్తారు. సంక్లిష్టమైన భారతీయ జీవితాన్ని సరళీకరించడానికి జరుగుతున్న ప్రయత్నాలను రచయిత్రి శాంతి శ్రీ బెనర్జీ తన కథలతో చక్కగా చిత్రీకరించారు. గతించిపోతున్న దానిని చూసి గుండెలు బాదుకునే వాళ్లు గతంలోకి వెళ్లి పోతారు కొందరు. ఆ గతాన్ని దాటి మునుముందుకు వెళ్లిపోతుంటారు మరి కొందరు. అలాగే శాంతిశ్రీ బెనర్జీ కథా రచయిత్రిగా ముందుకు వెళ్లే దారిలో ప్రయాణిస్తున్నారని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

శాంతి శ్రీ బెనర్జీ కథలు 2019 నుండి 2022 వరకు నాలుగేళ్ల కాలంలో రాసినవి. కానీ ఈ కథలు చదువుతుంటే ఇంకా రెండు మూడు దశాబ్దాల తర్వాత జరిగే పరిణామ క్రమాన్ని ఊహించి రాసినవిగా ఉన్నాయి. ప్రధానంగా పెద్ద పెద్ద కంపెనీలలో పెద్ద నగరాలలో మంచి ఉద్యోగాలలో ఉన్న ఆడపిల్లల కథలు. పెళ్లి గురించి ఆధునిక యువతీ యువకుల భావాలలో, ఆచరణలో వచ్చిన పెను మార్పులు, నిర్ణయాలు తీసుకొనడంలో, ప్రకటించడంలో స్పష్టత, తమ జీవితాలకు తామే బాధ్యత వహించగలిగిన ధైర్యము వీటన్నిటిని కథా వస్తువులు గా చెప్పవచ్చు. పెళ్లి తో సంబంధం లేకుండా కలిసి ఉండటం, కలిసి జీవించగలమన్న నమ్మకం బలపడితే పెళ్లి వరకు వెళ్లడం ,లేకపోతే విడిపోవడం ఇదొక పద్ధతి. **"అనివార్యం"** , **"నిర్ణయం"**, **"ఆత్మగోచరం"** ఈ కోవలోని కథలే. **"అసహజమనిపించే సహజం"** స్వలింగ సంపర్గానికి సంబంధించిన కథ . ఈ సమస్యలన్నీ అమ్మాయిలు అనుభవ కోణం నుండి కథలుగా చేయబడ్డవే అని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. "తరాల మధ్య అంతరాలు" కథలో నిరాడంబరతను పెళ్లి తంతుకు సంబంధించిన విలువగా చూపిన రచయిత్రి దానిని ఒక జీవన విలువగానే భావించింది. "మారిన విలువలు" కథ ఆ క్రమము లోనే వచ్చింది .ఈ కథలో మనోరమ సౌధామిని గురించి ఏమైనా గాని మనవతా దృక్పథం వీసమైన లేని ఆమె జీవనరీతిని ఆమోదించలేను అనుకుంటుంది . జీవితంలో డబ్బుకు, డాబుకు అపరిమిత ప్రాధాన్యము ఇచ్చే దిశగా మనుషులు దిగజారడం హేయమైనది అని రచయిత్రి అభిప్రాయపడ్డారు.

అత్తింటి నిరాదరణకు గురైన స్త్రీ పడిన ఆవేదన , తోడికోడళ్ల ఎగతాళి మాటలు మనసుపై ఎంత బలంగా ప్రభావితం చేస్తాయో, ఆరోగ్యాన్ని ఎంతగా క్షీణింప చేసి విషాద భరితమైన ముగింపునిస్తాయో ...రచయిత్రి శ్రీవారు ప్రణబ్ బెనర్జీ గారి నాయనమ్మ జీవితాన్ని ఆధారం గా చేసుకుని రాసిన **"వంచిత"** కథ మనసును తట్టి లేపుతుంది. చుట్టూ ఉండే సమాజం తమ ఎదుగుదలను చూసి ఓర్వలేక నూటి పోటి మాటలతో మనసును కష్టపెడుతున్నా కూడా, కొంతకాలం ఆందోళనకు ,అవమానాలకు, మానసిక రోగానికి గురై ఆ తర్వాత అందరి అంచనాలను తలకిందులు చేస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుని సమాజంలో గొప్ప కీర్తి ప్రతిష్టలు సాధించుకున్న మహిళ గురించి **"గ్రహణ విముక్తం"** కథలో రచయిత్రి చాలా చక్కగా తెలియజేశారు. చిన్నప్పటినుండి ఒకే తరగతిలో చదువుకొని పెద్దయ్యాక జీవితంలో స్థిరపడి పెళ్లి చేసుకోవాలనుకున్న ఇద్దరు స్నేహితుల కథను తెలియజేస్తూ , కులాలు వేరైన కారణంగా తల్లిగారి మాట జవదాటని అబ్బాయి వేరే ఒక అమ్మాయిని పెళ్లి చేసుకుని వెళితే ,నిరాశకు గురి కాకుండా అంతకంతకు ఎదిగి, తన కాళ్ళ మీద తాను నిలబడి ఆధునిక మహిళ గురించి రాబోయే తరానికి దిక్సూచిగా రచయిత్రి శాంతి శ్రీ బెనర్జీ రాసిన **"ఆత్మాభిమానం"** కథ వాస్తవానికి దగ్గరగా ఉంది.

ప్రధానంగా ఎగువ మధ్యతరగతి ఉన్నత ఉద్యోగ వర్గాల స్త్రీల చుట్టూ కథలు అల్లడానికి ముంబై, బెంగళూరు ,చెన్నై వంటి పెద్ద నగరాలలో కథలు నడపడానికి శాంతిశ్రీ బెనర్జీకి అవి అనుభవ విషయాలని, సన్నిహితంగా తెలుసుకునడానికి వీలైనవి అని అనుకోవచ్చు . ఆ పరిధిని దాటి ఆమె మూడు శ్రామిక కథలను కూడా రాసింది. **"సీత", "తిత్రి", "ఆత్మస్థైర్యం"** అనే కథలలో మొదటిది ఒక ఇంటి పనిమనిషి కథ, రెండవది తన పిల్లల్ని బాగా చదివించి పైకి తేవాలనుకునే భర్త లేని ఒక గిరిజన మహిళ కథ . మూడవది కరోనా కాలం నాటి ఆటో డ్రైవర్ కూతురు మల్లీశ్వరి కథ. శాంతి శ్రీ బెనర్జీ నగరవాసుల, పైమధ్యతరగతి, మధ్యతరగతి జీవితాలను ఎంతగా చిత్రించగలరో... శ్రామికుల జీవితాలను కూడా అంత బాగా చిత్రించగలరని ఈ కథల్ని చదివితే తెలుస్తుంది.

**"నెహ్రూ గారి భార్య"** ఒక వాస్తవ జీవన గాథ. శారా జోసెఫ్ రాసిన 'బుధినీ" నవల చదివి ప్రభావితమై వ్రాసిన ఈ కథ సామాజిక తెగల సంప్రదాయాలు, విశ్వాసాలు జీవితంలో ఎప్పటికీ సరిదిద్ద లేని విధ్వంసాలు, ఎంత సృష్టి స్తాయో సూచించింది. సమకాలపు జీవన సంఘర్షణల నుండి, జీవిత సందర్భాలనుండి . ''విూ... టు'' కథ లో యూనివర్సిటీలో జరుగుతున్న లైంగిక వేధింపులను ధీటుగా ఎదుర్కొని వీటికి కారణమైన వారిని సస్పెండ్ చేసే వరకు తమ ఉద్యమాన్ని సాగించిన ఇద్దరు విద్యార్థినుల గాథ పాఠకులను ఆలోచింప చేస్తుంది. మనుషులను మంచివైపు నడిపించగల ఘాఢమైన కథలు భవిష్యత్తులో మరింతగా వ్రాయగలుగుతుందనే ఆశను వాగ్దానం చేస్తూ... శాంతి శ్రీ బెనర్జీ కలం నుండి జాలువారిన "మానుషి" కథా సంపుటి వాస్తవ సంఘటనలకు ప్రతీకగా సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. శాంతి శ్రీ బెనర్జీ నుండి మరిన్ని కథా సంపుటిలు, కవితా సంపుటిలు రావాలని ఆశిద్దాం.

**ప్రతులకు:**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
నవోదయ పబ్లిషింగ్ హౌస్
మరియు
అన్విక్షి పబ్లిషర్స్ ప్రై.లి.
అజర హౌస్,59/సి/డి
ఎంఎల్ఏ కాలనీ
బంజారాహిల్స్
హైదరాబాద్
సెల్:9849888773



–బండారు సునీత
9440671530

## నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-19)

ఒత్తిడి లో నుండి బయటపడితే
చిత్తం
ఉత్తమ ఫలితాలను సాధిస్తుంది!
ఒక విజయం
అనేక సాహసాలకు నాందిగీతం పాడుతుంది!
తల్లి కూతుళ్ళ వంటి
ఆ అత్తా కోడళ్ళు
దురాలోచనాపరులకు కంట్లో నలుసులు
మంచి మనసున్న వాళ్లకు పన్నీటి చినుకులు.
కాలం ముళ్ళ మీద
సమయోచితమైన నిర్ణయాల చెప్పులతో
నడవడం అలవడింది
శరీరాలు బలహీనంగా కనిపించినా,
గుండెల నిండున్న బలం
ప్రయాణాన్ని బలహీన పడకుండా నడిపించింది.
దినాలు వారాలుగా, నెలలుగా, వత్సరాలుగా
పరిణామం చెందుతున్నాయి
ఆశ నెరవేరే అవకాశం లేక
ఎగిసిపడే కోరికల గుర్రాలు
దిశలు మార్చుకున్నాయి
సరయు కూతురు బడిలో చేరే
తరుణం వచ్చేసింది
'ఏం పేరు?'
రిజిస్టర్ లో పేరు రాసుకునేటప్పుడు
అడిగింది పంతులమ్మ
'భద్ర'
తన ప్రాణ స్నేహితురాలు పేరులో
మూడింట రెండొంతులు చెప్పింది
అమ్మాయిలకు మూడు అక్షరాల పేరు
బాగుంటది కదా
పంతులమ్మ అజ్ఞానానికి
సరయు చిరునవ్వు సమాధానం
తనలాగే మూడు అక్షరాల పేర్లున్నోళ్లు
ముప్పైమూడు కోట్లు ఉండవచ్చు
సంఖ్యాశాస్త్రం నిజమైతే
వాళ్లందరివి
వంకర లేని జీవితాలే కావాలి కదా!
డబ్బు ఎక్కువైతే వాస్తు
మనసుకు జబ్బు ఎక్కువైతే జ్యోతిష్యం
గుర్తుకు రావడం సహజం
తాను ఆ గడపలన్నీ దాటి
బడిగడపలో అడుగుపెట్టిన సంగతి
ఆ పంతులమ్మకు తెలువకపోవచ్చు.
చిన్నదాన్ని బడిలో చేర్చుకోవడానికి
చిన్న పరీక్ష పెట్టింది పంతులమ్మ
'నీ బిడ్డ ఉషారుగున్నది'
అన్న కితాబిచ్చింది
పైసా అవసరం లేకుండానే
పలకా బలపం ఇచ్చింది
బడి గుడిలో మంచి చోటిచ్చింది
అందుకే...
పంతులమ్మ 'సల్లంగుండాలె'
అనుకున్నది సరయు!



–దోరవేటి
సెల్:9866251679

## బావ కోసం.. (కథ)

"బావా ఎలా ఉన్నావ్ బాగున్నావా !సమయానికి తింటున్నావా ఉద్యోగం ప్రిపరేషన్ లో పడి నీ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నావా? ఎప్పుడొస్తావు , నీ రాక కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా నీవు ఈసారి ఉద్యోగం సంపాదించాలని నేను మొక్కని దైవం లేదు .నీ కోరిక తప్పకుండా నెరవేరుతుంది అని"మీ ఫోన్లో తాను మాట్లాడాలనుకున్న మాటలన్నీ చెప్పింది వెన్నెల. దానికి సూర్య నేను బాగున్నాను వెన్నెల నా గురించి నువ్వు ఏం కంగారు పడకు, నేను బాగా చదువుతున్నాను, సమయానికి తింటున్నాను. ఉద్యోగమే నా జీవిత లక్ష్యం నీకు తెలుసు కదా. అనే సమాధానం చెప్పాడు. "బావ కళ్ళల్లో ఉన్నట్టు ఉన్నావు సరే నేను ఎలాగో అలాగా ఉంటాను" కానీ నువ్వు జాగ్రత్త అంటూ ఉంటాను అని ఫోన్ పెట్టేసింది.

వెన్నెల ,సూర్య ఇద్దరు బావ మరదళ్లు చిన్నప్పటినుండి వాళ్ళిద్దరూ ప్రేమగా ఉండేవారు. ఒక్కరంటే ఒకరికి పంచ ప్రాణాలు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు. 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్న పల్లెటూరు పిల్ల వెన్నెల. చదువు ఆపేసి ఇంట్లో బీడీలు చుడుతూ ఉండేది. కానీ సూర్య మాత్రం పట్నంలో పెద్ద చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం కోసం కష్టపడుతున్నాడు. ఉద్యోగం వచ్చాక వెన్నెలను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు . బావ సంతోషం కోసం సరేనని, ఉద్యోగం వచ్చాకే పెళ్లి చేసుకుంటానని ఒప్పుకుంది. వెన్నెల చదివింది తక్కువే కానీ అన్ని విషయాలు తెలిసిన అమ్మాయి అసలు సిసలైన పల్లెటూరి వేషధారణలో పరికిణీ లో చాలా అందంగా కనిపిస్తుంది. అమాయకపు మాటలు చలాకీగా ఉంటూ అందరినీ నవ్విస్తూ ఉండేది. ఇదే బావ సూర్యకు చాలా నచ్చింది అందుకే మరదలు కోసం పరితపిస్తాడు. తన బావతో మాట్లాడకుండా ఒక రోజు కూడా ఉండలేదు. అందుకే కనీసం రోజుకు ఒక్కసారైనా పట్నంలో ఉన్న తన బావకు ఫోన్ చేసి యోగక్షేమాలు తెలుసుకుంటుంది. లేకపోతే తన మనసు కుదుటపడేది కాదు.

సూర్య రాత్రింబవళ్లు బాగా కష్టపడి, ఉద్యోగం కోసం పరీక్ష రాసాడు .నెల రోజుల్లో ఫలితాలు వస్తాయి పట్టణం నుండి తను ఊరికి చేరుకున్నాడు. ఫలితాలలో సూర్యకు మంచి ఉద్యోగం వచ్చింది .అతడి ఆనందానికి అవధులు లేకుండా పోయింది .తన బావకు ఉద్యోగం వచ్చిందని వెన్నెల తాను మొక్కిన మొక్కులను దేవుళ్లకు చెల్లించింది. సూర్య నిజామాబాద్ జిల్లాకు డిప్యూటీ తహసిల్దారుగా వెళ్లిపోయాడు. తన బావ తనని విడిచి ,ఉద్యోగం కోసం దూరంగా వెళుతున్న బాధ ఎక్కువైంది. వెన్నెలకు ఊరడించి చెప్పాడు .రెండు సంవత్సరాలు పూర్తయితే సొంత జిల్లాకు రావచ్చు .అప్పుడు మనం అనుకున్నట్టు పెళ్లి చేసుకుందామని మాట ఇచ్చి వెళ్లిపోయాడు. ఇది విన్న వెన్నెల ఒక కంటి నుండి ఆనందభాష్పాలు, మరో కంటి నుండి సంతాప బాష్పాలు వచ్చాయి. సరేనంటూ బావ సూర్య ను సాగనంపింది .ఇలా కొద్ది రోజులు గడిచాయి.

రోజుకొకసారైనా ఫోన్ చేసి మాట్లాడే వెన్నెలతో సూర్య సరిగా మాట్లాడడం లేదు. ఒక్క రింగుతో ఫోన్ లిఫ్ట్ చేసే తన బావ ఇప్పుడు నాలుగు ఐదు సార్లు ఫోన్ చేసినా తీయట్లేదు. మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. ఇది వెన్నెల ను ఎంతో కుంగ తీసింది. తన బావ అలా తనతో ప్రవర్తించడం ఎంత మాత్రం తట్టుకోలేకపోయింది .రాత్రుల్లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేది తన బావ ఎందుకోసం అలా చేస్తున్నాడు అని ఆలోచిస్తూ కలత నిద్రపోయేది. దసరా పండక్కి ఊరొచ్చిన తన బావ ను నిలదీసి అడిగింది. తనతో ఇంతకు మునుపులాగా చలాకీగా ఉండట్లేదు, మాట్లాడడం లేదని .అప్పుడు సూర్య ఏమి సమాధానం చెప్పలేక, దాటవేసేవాడు . ఇది వెన్నెలను మరింత నైరాశ్యం లోకి నెట్టివేసింది.

దసరా పండుగ రోజు సూర్య వెన్నెలకు ఫోన్ చేసి గుడి దగ్గరకు రమ్మని చెప్పాడు ,తనతో ముఖ్యమైన విషయం చెప్పాలని. ఎగిరి గంతులు వేసిన వెన్నెల సరేనని గుడి దగ్గరికి వచ్చింది. అక్కడ తన కోసం ఎదురుచూస్తున్న బావ పక్కన కూర్చుంది . "బావ ఫోన్లో ముఖ్య విషయం అని చెప్పావు కదా" ఏమిటని సూర్య కళ్ళల్లోకి చూసి ప్రశ్నించింది. ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైంది వెన్నెల. తన బావ కళ్ళల్లో నుండి కన్నీటి వర్షం. "ఏమైంది బావ ఎందుకోసం ఏడుస్తున్నావు "అని తన చేతిని బావ చేతిలో వేసి అడిగింది . నోటి నుండి మాట పెగల లేదు. ఒక్కసారిగా గట్టిగా వెన్నెలను కౌగిలించుకొని బోరున విలపించాడు. వెన్నెల కూడా అనుకోకుండా ఏడ్చింది.

ఆ అమర ప్రేమికుల రోదన నుండి కొద్దిసేపటికి ఇద్దరు తేరుకున్నారు .వెన్నెలతో అసలు విషయం చెప్పాడు . నిన్ను పెళ్లి చేసుకోవడం మా నాన్నకు ఎంత మాత్రం ఇష్టం లేదని ,ఉద్యోగం ఉన్న అమ్మాయిని చేసుకోవాలని నన్ను బలవంతం పెడుతున్నారు. నేను ససేమిరా? అన్నాను. నేను వెన్నెల తప్ప ఎవరిని పెళ్లి చేసుకోనని చెప్పాను. అమ్మది కూడా నా మాటే. నాన్న మాత్రం కరా ఖండిగా చెప్పేశాడు. ఇంకోసారి వెన్నెలతో ఫోన్లో కూడా మాట్లాడొద్దు. నా మాట జవదాట వద్దని హెచ్చరించాడు .ఈ విషయం చెప్పగానే వెన్నెల చాలా బాధ పడింది. కానీ సూర్య మాత్రం వెన్నెల నీతోనే నా జీవితం, నీవు లేనటువంటి ఈ ప్రాణం నాకు గడ్డి పోచతో సమానం . నువ్వు లేని జీవితాన్ని తట్టుకోలేను అని చెప్పాడు.

వెన్నెల తెలివైన అమ్మాయి. తన మీద బావకు ఇంత ప్రేమ ఉందని తెలుసుకొని ఆనందపడిన, ఆ ప్రేమ తనకు కలకాలం దక్కదని నిర్ణయించుకుంది. తన బావగారి తండ్రి కోరిక ప్రకారం, ఉద్యోగం ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకొమ్మని వేడుకుంది . "బావ నేను పల్లెటూరి పిల్లను. మామూలుగా చదువుకున్న దాన్ని కదా. నువ్వు నాకు దక్కకపోతే ఏంటి నీ గుండెల్లోన చోటిచ్చావు. ఈ జీవితానికి నువ్వే నాకు సర్వస్వం. జీవితాంతం ఇలా ఏకాకిగా నిన్ను, నీ జ్ఞాపకాలను తలుచుకుంటూ, జీవితాన్ని గడుపుతాను" అనగానే సూర్య ఆశ్చర్యపోయాడు. మీ నాన్నగారి కోరిక నెరవేర్చు. మీ కుటుంబంలో నువ్వు సంతోషాన్ని ఇవ్వాలి అని వెన్నెల చెప్పింది.ఉద్యోగం ఉన్న అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని తనమీద ఒట్టేసి చెప్పమని సూర్యని బలవంతం చేసింది .తన సంతోషం కోసం ప్రేమను త్యాగం చేస్తున్న వెన్నెలను చూసి ,సరే అంటూ ఒట్టేసి చెప్పాడు.చివరగా వెన్నెల వెళుతూ" బావా ఒక్క మాట ,అంటూ ఈ విషయం మన ఇద్దరి మధ్య ఉండాలి ఎవరికీ తెలియకూడదు అని చెప్పి వీడ్కోలు చెప్పి మౌనంగా వెళ్ళిపోయింది.



–యాదవరం చంద్రకాంత్ గౌడ్
9441762105

## నివాళి సంబురాలు..!

ఉన్నపుడు ఊసెత్తని లోకులు..
పార్థివ దేహం వద్ద భలే సూక్తులు !

బతుకంతా ఈసడించిన జనులు..
పోయాక ఒలకబోస్తారు కన్నీటి నటనలు !

అయ్యవ్వకు తిండి పెట్టని బిడ్డలు..
కాకికి పెడ్తారు విస్తరి నిండా పంచభక్ష్యాలు !

బాధను పట్టించుకోని బంధువులు..
శవయాత్రలో ఘన నివాళి నృత్యాలు !

కన్నోళ్లకు గంజి నీళ్లే పోయని పుత్రులు..
అస్థికల్ని గంగా జలంలో కల్పుతరు !

అమ్మనాన్నల్ని ఈసడించుకునేటోళ్లు..
ఫోటోలకు వేస్తారు పెద్ద పెద్ద దండలు !

చిల్లిగవ్వ కూడా విదిల్చని కొడుకులు
పాడెపై చల్లుతరు చిల్లర సంచులు !

ఏనాడు ఆప్యాయత పంచని బిడ్డలు
అంత్యక్రియల్లో ఒలకబోస్తారు నటనలు !

జీవితాంతం మాట్లాడని బంధువులు
పోయాక కడ్తరు మందలింపుల క్యూలు !

అంత్యక్రియల ఘన సన్మానాలు కాదు
ఉన్నపుడే వర్షించాలి ప్రేమ జల్లులు !



– డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## తలపులు

ఎండ వానా కలయికలో
ఇంద్రధనస్సు!
మన కలయికలో ప్రేమ ఉషస్సు!

నీవు నాకు దూరమైనా
నా తలపులో నిలిచే ఉన్నావు!

పురిటి నొప్పులు మరచిపోయాను
పువ్వు లాంటి నీ స్పర్శతో!
అమ్మ ప్రేమతో పెరిగావు
అమ్మను ప్రేమించడం మరి చావు!

నేలరాలే వరకూ
ప్రతి చినుకూ ఓ మంచి
ముత్యమే!

ఊహ ఎంత అద్భుతం..
అది మన (సు)కు
నచ్చినట్లుగా ఉంటుంది.



– వి. మంగతాయారు
సెల్: 9949278483

## శ్రీ శ్రీ ఓ రవి కిరణం

మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి
తోసుకు పోదాం పోదాం పైపైకి..
అని విప్లవ శంఖం పూరించినా..

మనదీ ఒక బ్రతుకేనా..
కుక్కల వలె, నక్కల వలె,
మనదీ ఒక బ్రతుకేనా..
సందులలో పందుల వలె,
అని బతుకు పోరు లో
జీవితంను విశ్లేషంచినా...

ముందుదగా వెనుక దగా,
కుడి ఎడమల దగా దగా,
అని కన్నెర్ర చేసినా..
నా హృదయంలో నిదురించే
చెలీ భావ గీతం చెలికై పాడినా..
తెలుగు వీర లేవరా అని
ఉత్తేజంగా గుండె తట్టి నిదుర లేపినా..
పాడవోయి
భారతీయుడా అని
స్వాతంత్రపు గీతి ఆలపించినా..
శ్రీ శ్రీ కే చెల్లు చెల్లు..
అతడే మన శ్రీరంగం శ్రీనివాసరావు..!

తెలుగు సాహిత్యం లో ఎర్రజెండా.,
సాహిత్య లోకంలో
తెలుగు జెండా,
అభ్యుదయ
కవిత్వానికి ఒరవడి,
కమ్యూనిస్టు భావాల
విప్లవ కవి,
పీడిత ప్రజలకై పోరాడిన పక్షపాతి,
సామ్యవాదపు నవయువ
అభ్యుదయ కవి,
అక్షరాలానే ఆయుధాలుగా
మలచిన అపర మేధావి.,
జోహార్ శ్రీ శ్రీ
అతడే మన
శ్రీరంగం శ్రీనివాసరావు..!



–ఎస్. రాజేష్
849335757

# సారస్వత ప్రతిభామూర్తి ఆచార్య ఎస్వీరామారావు

సాహితీ వరేణ్యులు





తెలుగు సారస్వత క్షేత్రంలో సద్విమర్శక పాత్రను సమయోచితంగా, సముచితంగా, సమున్నతంగా సారవంతం చేసిన సాహితీ ప్రతిభామూర్తి ఆచార్య ఎస్వీరామారావు, నిత్యనూతన ప్రతిభతో విరాజిల్లుతున్న విరాణ్మూర్తి. తెలుగు సాహిత్యంలో విమర్శకుడిగా ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకోవడమే కాకుండా విమర్శరంగాన్ని పరిపుష్టం చేశారు. ఎస్వీరామారావు విమర్శకుడిగా కాక సద్విమర్శకుడిగా తెలుగు సాహిత్యంలో నిలిచిపోయారు. తెలుగు సాహిత్య విమర్శకు కొత్త సొబగులు దిద్దారు. కొత్త ఆలోచనా ధోరణులను ప్రవేశ పెట్టారు. పరిశోధనాత్మక విమర్శకు పదును పెట్టారు. ప్రాచీన సాహిత్యంపై పట్టు సాధించడమే కాదు తనకున్న పరిశీలనాశక్తితో, పరిశోధనాసక్తితో అనేక కొత్త విషయాలను తెలుగు సారస్వతానికి పరిచయం చేశారు. విమర్శకుడికి ప్రతిభే ముఖ్యం కాదు, సునిశిత విమర్శనా శక్తి అత్యవసరం. ఆయన అభిరుచికి తగ్గట్టే తెలుగులో సాహిత్య విమర్శ పరిశోధన గ్రంథం అందరికీ ప్రామాణికమైంది. వివిధ విశ్వవిద్యాలయ స్థాయిల్లో అది ఆకర గ్రంథంగా నిలిచింది. పోటీ పరీక్షలకు మార్గదర్శకమై నిలచింది. ఇంతటి పరిశోధక మూర్తిని, ప్రతిభాకిరీటిని కన్నబిడ్డ పాలమూరు జిల్లా. తెలంగాణ మాగాణంలో పూచిన మకరందపు గుభాళింపు ఆచార్య ఎస్వీ రామారావు.

సంస్థానాల జిల్లాగా పేర్గాంచిన పాలమూరు జిల్లా వనపర్తి తాలుకాలోని శ్రీరంగాపురంలో 1941 జూన్ 5న సూగూరు వాసుదేవరావు, రామచూడమ్మలకు జన్మించిన ఎస్వీరామారావు స్వగ్రామంలో ప్రాథమిక విద్యను, వనపర్తిలో ఉన్నత విద్యనభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ, పీజీ చేశారు. 1964లో ఎం.ఏ తెలుగు, 1965లో హిందీ భూషణ్ చేశారు. ఆ తర్వాత 1966 నుంచి లెక్చరర్‌గా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. లెక్చరర్‌గా పనిచేస్తూనే 1973లో 'తెలుగులో సాహిత్య విమర్శ-అవతరణ వికాసములు' అనే అంశంపై సాధికారికమైన పరిశోధన చేశారు. ఇది విశ్వవిద్యాలయ స్థాయిలో రెఫరెన్స్ పుస్తకంగా వాడబడుతోంది. 1966లో ఉద్యోగంలో ప్రవేశించినప్పటినుంచి లెక్చరర్‌గా, 1976లో రీడర్‌గా, 1987లో ప్రొఫెసర్‌గా పనిచేసారు. అనంతరం 2001లో ఉస్మానియా ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా పదవీ విరమణ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి ముగించారు. తెలుగు శాఖ అధ్యక్షులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఇప్పటివరకు వీరి నేతృత్వంలో 19 పిహెచ్.డిలు, 15 ఎం.ఫిల్ పట్టాలు పొందారు.

వనపర్తిలో విద్యాభ్యాసం చేస్తున్నపుడే సాహితీ వ్యాసంగం పట్ల ఆకర్షితులయ్యారు. చిన్నపుడే అనేక సాహిత్య గ్రంథాలు చదవడం వల్ల తనలో కూడా రచనా వ్యాసంగం మొగ్గ తొడిగింది. రాయడమే కాదు, వాటిని పత్రికలకు పంపడం, అవి ప్రచురితమవ్వడం, మళ్ళీ పంపడం. ఇలా తన రచనలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతుండడంతో కలానికి పదునుపెట్టారు. సారస్వతకేతనాన్ని ఎగురవేశారు.

## 'జ్యోతిర్మయి' స్థాపన

పాలమూరు జిల్లాలో సారస్వత చైతన్యాన్ని కల్గించాలనే లక్ష్యంతో 1965లో 'జ్యోతిర్మయి' అనే సాహిత్య, సాంస్కృతిక సమితిని స్థాపించారు. స్థాపించడమే కాదు జిల్లా కవులతో 'జ్యోతిర్మయి' అనే కవితా సంపుటిని తొలిసారిగా1966లో వెలువరించారు. జిల్లా కథల సంపుటి 'సమర్పణ'ను 1967లో ఆవిష్కరించారు. ఇందులో మొత్తం ఐదు కథలున్నాయి. అనంతరం 'అలంపూరు సంచిక, ఆత్మకూరు సంచిక, 'సుజాత' గడియారం షష్టిపూర్తి సంచిక మొదలైనవి వెలువరించారు. ఇంకా తిప్పిరెడ్డి సత్యనారాయణ రెడ్డి రచించిన 'లేచిగుళ్ళు' కవితా సంపుటిని, చౌడూరి గోపాలరావు రచించిన 'మల్లిపాటలు'ను, చెన్నమరాజు కొండలరావు రచించిన 'శ్రీమల్లిఖార్జున స్తవం'ను, జొన్నవాడ రాఘవమ్మ రచించిన 'రాధికా గీతాలు'ను, గడియారం రామకృష్ణశర్మ రచన 'పాంచజన్యము'ను, బూర్గుల



రామకృష్ణారావు రచించిన 'పుష్పాంజలి' పద్యకావ్యమును, 'నివేదన' కవితా సంపుటిని వెలువరించారు. చౌడూరి గోపాలరావు షష్టిపూర్తి సంచిక 'చౌడూరి ఆరుపదులు'ను, బూర్గుల రామకృష్ణారావు రచించిన పీఠికలను 'బూర్గుల పీఠికలు'గా, ఆంగ్లంలో బూర్గుల జీవిత చరిత్రను వెలువరించి తన సాహితీ పిపాసను చాటుకున్నారు. అంతే కాదు పాలమూరు జిల్లా రచయితల మహాసభలను జ్యోతిర్మయి ఆధ్వర్యంలో 1972లో జిల్లా కేంద్రమైన మహబూబ్‌నగర్‌లో రెండు రోజులపాటు నిర్వహించారు. ఆనాటి సభకు అప్పటి రాష్ట్ర సాంస్కృతిక, విద్యాశాఖమంత్రి భాట్టం శ్రీరామమూర్తి, సాహిత్య అకాడమి కార్యదర్శి దేవులపల్లి రామానుజరావు, దాశరథి, వి.పి.రాఘవాచార్యులు, గడియారం రామకృష్ణశర్మ, డా॥జి.వి.సుబ్రమణ్యం, ఆచార్య ఎం.కులశేఖరరావు, డా॥ఇరివెంటి కృష్ణమూర్తి, ఆచార్య వంగపల్లి విశ్వనాథం, డా॥ఎం.వీరభద్రశాస్త్రి,



పండా శమంతకమణి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, డా॥ముకురాల రామారెడ్డి, కేశవపంతుల నరసింహశాస్త్రి, పెరవలి లింగయ్యశాస్త్రి, డా॥ఇరివెంటి వేంకటేశ్వర శర్మ, డా॥ వెల్దండ రఘుమారెడ్డిలు హాజరై వివిధ సాహిత్యాంశాలపై ప్రసంగించారు. జిల్లాకు చెందిన లబ్ధ ప్రతిష్టులైన సాహితీద్రష్టలు, సంస్కృత విద్వాంసులు ఖండవల్లి నరసింహశాస్త్రి, తెలకపల్లి రామచంద్రాశాస్త్రిలను ఘనంగా సన్మానించారు. పుట్టిన గడ్డపై మమకారంతో ఆచార్య ఎస్వీరామారావు సారస్వత ప్రయాణాన్ని కొనసాగించారు.

## రచనలు

ఆచార్య ఎస్వీరామారావుకు మొదటినుంచి విమర్శనరంగంపై అభిరుచి కలిగింది. తను రాసిన అనేక సాహిత్య వ్యాసాలను తొలిసారిగా 'అన్వీక్షణం' పేరుతో 1984లో వెలువరించారు. ఇందులో ప్రాచీన, ఆధునిక సాహిత్యానికి సంబంధించిన పద్నాలుగు వ్యాసాలు ఎస్వీ రామారావు విమర్శనా ముఖాన్ని ఆవిష్కరిస్తాయి. ప్రాచీన కవులైన నన్నయ, పోతన, ఎర్రనల సాహితీ వైదుష్యాన్ని వెల్లడించారు. పోతన, ఎర్రనల తులనాత్మక అధ్యయనం సాహితీ పరులను ఆలోచింపజేస్తుంది. ప్రబంధ యుగంనాటి సామాజిక, మత, రాజకీయ భూమికను పరామర్శించారు. ఆధునిక కవులుగా ప్రసిద్ధిగాంచిన దాశరథి, కుందుర్తి, బోయి







ఆచార్య ఎస్వీ. రామారావుతో సంభాషిస్తున్న భీంపల్లి శ్రీకాంత్

భీమన్న ,సినారెల కవితా వైజయంతిని విశ్లేషించారు. తెలుగు నవలా విమర్శను ఆవిష్కరించారు. తర్వాత 1992లో 'సమవీక్షణం' వ్యాస సంపుటిని వెలువరించారు. దీనిక పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ విమర్శక గ్రంథ పురస్కారం లభించింది. ఎస్వీరామారావు నిరంతర సాహిత్య అధ్యయనానికి 'సమవీక్షణం' గ్రంథం ఉదాహరణగా చెప్పవచ్చు. తెలుగు సాహితీ జగత్తులో బలమైన ముద్రవేసిన మహనీయుల జీవితాలు, వారి ప్రతిభావిశేషాలు ఇందులో పొందుపరిచారు. ఈ గ్రంథం ద్వారానే ఎస్వీరామారావు ఉత్తమ విమర్శకుడిగా గుర్తింపు పొందారు. అనంతరం 1998లో అభివీక్షణం అనే వ్యాస సంపుటిని వెలువరించారు. ఇందులోని పదమూడు వ్యాసాలు ఎస్వీరామారావులోని విమర్శకుడిని పట్టి చూపుతాయి. ఈ 'అభివీక్షణం'లోనూ ప్రాచీన, ఆధునిక సారస్వతాన్ని విమర్శక దృష్టితో దర్శించారు. తిక్కనతో ప్రారంభించి 'శబ్ద రత్నాకరం'తో ముగించారు. మహా భారత రచనలో తిక్కన పద్యంలోనూ, గద్యంలోనూ వినూత్న ప్రయోగాలను ఆవిష్కరించాడని, మహాభారత రచనలో నన్నయది కథా కథన పరమైనశైలి అయితే, తిక్కనది వర్ణనాత్మకమైన, సంభాషణపరమైన శైలియని విశ్లేషించారు.



ఆధునిక సాహిత్యానికి సంబంధించి రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, మధునా పంతుల సత్యనారాయణశాస్త్రిలు రచించిన వారి గ్రంథాలను విమర్శనాత్మకంగా వివేచించారు. కథానిక, కవిత, నవల, నాటకం, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియలను విపులంగా చర్చించారు. 2004లో 'కావ్యామృతం' పేరుతో మరో వ్యాస సంపుటిని వెలువరించారు. ఇందులోని 12 వ్యాసాలు ప్రాచీనతను, ఆధునికతను సంతరించుకున్నాయి. ప్రాచీన కవుల స్నేహసంబంధాలు ఎలా ఉండేవో, వారి సహచర్యం వల్ల గ్రంథ రచన ఎలా సాగిందో సోదాహరణంగా వివరించారు. 'ప్రాచీన కవిత్వంలో హాస్యం' వ్యాసంలో హాస్యరస పోషణ చాలా కష్టతరమంటూ తీర్పు ఇచ్చేశారు. ఆధునిక కవితా ప్రవక్తలైనా రాయప్రోలు, గురజాడ, విశ్వనాథ సత్యనారాయణ, బోయి భీమన్న వంటి సాహితీ ఉద్దండుల సాహిత్యాన్ని వీక్షించారు. 1998లో వెలువరించిన నన్నయ దర్శనం చక్కని వ్యాఖ్యాన గ్రంథం. నన్నయ కవితా దర్శనాన్ని ఈ గ్రంథం పట్టి చూపింది. ఈ గ్రంథంలో నన్నయ అవతారిక, మహాభారత ప్రశస్తి, రాజరాజనరేంద్ర ప్రశంస, నన్నయ ప్రశంస, నన్నయ వాఙ్మయ సూచిక, నన్నయ దర్శనం అని ఆరు విభాగాలున్నాయి. నన్నయ కవిత్వాన్ని సమున్నత దృష్టితో వివేచించిన గ్రంథమిది. ఎస్వీరామారావు వివిధ పుస్తకాలకు రాసిన పీఠికల సమాహారంలో 'కృత్యావలోకనం' పేరుతో వెలువరించారు. కావ్యానికి పీఠిక ఆత్మ వంటిది. కావ్యం యొక్క హృదయావిష్కరణే పీఠిక. దాదాపు శతాధిక గ్రంథాలకు పీఠికలు రాసిన ఎస్వీరామారావు 60 పీఠికలతో 'కృత్యావలోకనం'ను వెలుగులోకి తెచ్చారు. వివిధ గ్రంథాలకు రాసిన విభిన్నమైన పీఠికలు పరిశోధక గ్రంథాలకు సంబంధించినవి, ఆధునిక కావ్యాలకు చెందినవి. ఎస్వీరామారావు పీఠిక చదివితే చాలు గ్రంథ సంపదత్వం ఏపాటిదో తెలిసిపోతుంది. పీఠిక రచనలోనూ విమర్శనపాలు కనిపిస్తాయి. ఆయా గ్రంథాలకు పేరు తెచ్చిపెట్టేవి పీఠికలేననడం అతిశయోక్తి కాదు. ఆకాశవాణిలో చేసిన ప్రసంగాలతో 'మనోవీక్షణం' గ్రంథాన్ని 2006లో వెలువరించారు. ఇందులోని 32 వ్యాసాలు వ్యక్తి సంస్కారాన్ని ప్రబోధించేవిగా, యువకులను ప్రబోధించేవిగా, మరికొన్ని సమాజాన్ని మేల్కొపేవిగా ఇందులోని వ్యాసాలు నిలుస్తాయి. వైయక్తిక, సామాజిక, సాహిత్య విలువలను సమాజంలో నిలపాలన్న ఆకాంక్ష ఈ గ్రంథంలోని ప్రతి అక్షరం ప్రబోధిస్తుంది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన మహాభారతంలోని కర్ణ పర్వం ద్వితీయాశ్వాసానికి చక్కని వ్యాఖ్యానాన్ని అందించారు. 2006లో ఆచార్య వి.ఎం.ఎస్ .భీమశంకరం రచించిన భీమేశ్వర శతకానికి సవిమర్శక వ్యాఖ్యానం చేశారు. 2005లో 'శ్రీ సత్యసాయి అవతారం- దశావతార గాథలు'ను వెలువరించారు. సత్యసాయిబాబా దశావతార గాథలకు చక్కని వ్యాఖ్యాన గ్రంథమిది.

ఆచార్య ఎస్వీ రామారావు సాహితీ స్వర్ణోత్సవ కానుకగా 'పరిశోధనోత్సవం' వెలువడింది. ఇందులో ఉస్మానియా విశ్వవిద్యాలయంతో రామారావుకున్న అనుబంధం, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ చరిత్ర, విశ్వవిద్యాలయాల్లో పరిశోధన, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో పరిశోధన, పరిశోధన పర్యవేక్షణ, పిహెచ్.డి, ఎం.ఫిల్ పరిశోధకుల వివరాలతో పాటు ఎస్వీ రామారావు జీవన రేఖలు దర్శనమిస్తాయి. 2009లో 'శతాబ్ది కవిత' పేరుతో నూరేళ్ళ కవిత్వ ధోరణుల సమాలోచన చేశారు. దీనిని తెలుగు అకాడమి ముద్రించింది. నూరేళ్ళ కవితా ప్రస్థానాన్ని ఇందులో కాలానుగుణంగా దర్శించారు. తెలుగు సాహిత్యంలోని వాదాల గురించి, కవిత్వారూపాల గురించి సవివరణాత్మక విశ్లేషణ చేశారు. అంతేకాదు నూరేళ్ళ కవితా ప్రస్థానంలో వెలువడిన కవిత సంకలన గ్రంథాలను ఇందులో పొందుపరచడం విశేషం. ఎస్వీరామారావు కథలు, కవితలతో వచ్చిన గ్రంథం 'సాహితీ కదంబం'. ఇది 2010లో వెలువడింది. ఇందులోని 5 కథలతో పాటు 9 కవితలు చోటుచేసుకున్నాయి. నూటపది సంవత్సరాలుగా సాహిత్య చైతన్యాన్ని కల్గించిన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' గూర్చి 'నూటపది వసంతాల శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' పేరిట చిరు గ్రంథాన్ని వెలువరించారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వైభవానికి తోడ్పడిన వారి గురించి ఇందులో శ్లాఘించారు.

జన్మనిచ్చిన పాలమూరును మరిచిపోకుండా తల్లిరుణం తీర్చుకున్నారు. 'పాలమూరు సాహితీ వైభవం' పేరిట పాలమూరు సాహిత్యాన్ని ప్రపంచానికి చాటారు. ఇందులో క్రీ.శ.1000 నుండి క్రీ.శ.1900 వరకు తెలుగు, సంస్కృతంలో కావ్య రచన చేసిన 163 మంది కవుల చరిత్రను, జిల్లా సంస్థానాల సాహిత్య సేవను కొనియాడారు. అనంతరం 2011లో 'విశ్వనాథ దర్శనం' పేరిట విశ్వనాథ సాహిత్యాన్ని దర్శించారు. విశ్వనాథ కావ్యాలను సమదృష్టితో వివేచించిన తీరు విమర్శకులకే సాధ్యమవుతుంది. విశ్వనాథ విమర్శను, ప్రతిభను అంచనా వేసిన తీరు రామారావు సునిశిత పరిశీలనా శక్తిని తెలియజేస్తాయి. 2011లో తెలుగులో ప్రసిద్ధులైన విమర్శకుల గురించి 'విమర్శకవతంసులు' పేరుతో వెలువరించారు. ఇందులో సి.పి.బ్రౌన్ మొదలుకొని వల్లంపాటి వెంకట సుబ్బయ్య వరకు 23 మంది సుప్రసిద్ధ విమర్శకుల జీవిత, సాహిత్య రేఖలను దర్శించారు. వారి వారి విమర్శనా ప్రతిభను చక్కగా అంచనా వేశారు. వారి విమర్శనా రీతులను, సాహిత్య దృక్పథాలను లోకానికి అందించారు. 'పాలమూరు జిల్లా ఆధునిక యుగ కవుల చరిత్ర' పేరుతో 2012లో పాలమూరు జిల్లా ఆధునిక కవుల చరిత్రను తీసుకొచ్చారు. ఈ గ్రంథంలో సురవరం ప్రతాపరెడ్డి నుంచి ఆచార్య కమల వరకు ఉద్దండ పండితులను పరిచయం చేశారు. పాలమూరు జిల్లా కవులకు కాణాచి. సాహిత్యానికి పూదోట. సంస్థానాలకు ఖిల్లా. అందుకే ఇక్కడ సాహిత్యం అనంతంగా వికసించి తెలుగు సారస్వతమంతా వెదజల్లింది. ప్రపంచానికి తెలియని ఎందరో సాహితీ వేత్తలను



పరిచయం చేశారు ఈ గ్రంథంలో ఎస్వీరామారావు.

పాలమూరు జిల్లా నుంచి తేరుకుని ఎస్వీ రామారావు 'తెలుగు సాహిత్య చరిత్ర'ను వెలువరించారు. తెలుగు సాహిత్యంలో ఎన్నో సాహిత్య చరిత్ర గ్రంథాలు వెలువడ్డాయి. కానీ, ఒక విమర్శకుడి కలంలోంచి వెలువడిన చరిత్ర గ్రంథం లోకానికి దీపధారి వంటిది. సాహిత్య చరిత్ర నిర్మాణం అంత తేలికైన విషయమేమికాదు. విస్తృతమైన అధ్యయనం, సునిశిత పరిశీలనా శక్తి, పరిశోధనా ఆసక్తి వంటివి ఉంటేనే బహుచక్కని చరిత్ర గ్రంథం వెలుగులోకి వస్తుంది. ఆ పనిని ఎస్వీరామారావు ఒక్క చేత్తో చేసి తన పాండితీవైదుష్యాన్ని చాటిచెప్పాడు. తెలుగు సాహిత్య చరిత్రలో మరుగున పడిపోయిన ఎన్నో ఆణిముత్యాలను ఇందులో ఆవిష్కరించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఇదొక ఆణిముత్యంగా భాషిస్తుందనడంలో అతిశయోక్తి ఎంత మాత్రం లేదు. 'తెలుగు సాహిత్య చరిత్ర'ను వెలువరించిన అనంతరం 'తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం' అనే తెలంగాణ సాహిత్య చరిత్ర గ్రంథాన్ని వెలువరించారు. ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యానికి ఇదొక మచ్చుతునక. స్థానిక సాహిత్య చరిత్రను అక్షరబద్ధం చేస్తూనే అస్తిత్వాన్ని నిలుపుకొనే ప్రయత్నంలో ఇది వెలువడింది. ఇదివరకు రాసిన తెలుగు సాహిత్య చరిత్రలన్ని ఆంధ్రసాహిత్య కోణంలోంచి వచ్చినవే. తెలంగాణ కోణం నుంచి వచ్చిన 'తెలంగాణ సాహిత్య చరిత్ర' ఇది. సాహిత్యపరంగా తెలంగాణా ఎంత సుసంపన్నమైందో ఈ గ్రంథం తేటతెల్లం చేసిం ది. తనదైన సాహిత్య చరిత్రను ఆవిష్కరించింది. అందుకు ఎస్వీరామారావును తప్పక తెలంగాణ సాహితీ లోకం అభినందించాలి. అలాగే తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం గ్రంథానికి కొనసాగింపుగా ఎస్వీ రామారావు తెలంగాణ సాహిత్య చరిత్ర అనే గ్రంథాన్ని వెలువరించారు. ఎస్వీ రామారావు రచించిన పీఠికలు, సమీక్షలతో కలుపుకొని గ్రంథావలోనంగా వెలువరించారు. ఇందులో సిద్ధాంత గ్రంథాలకు, కవితా సంపుటాలకు, స్థలపురాణాలకు, జానపద వాఙ్మయానికి సంబంధించిన పీఠికలు ఈగ్రంథంలో కనిపిస్తాయి. అలాగే జన్మనిచ్చిన శ్రీరంగాపురం గ్రామ కవులతో మా ఊరి కవులు పేరుతో ఒక పుస్తకాన్ని వెలువరించారు. అలాగే తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన సూచికతో తెలంగాణ ప్రాచీన సాహిత్య కరదీపిక గ్రంథాన్ని వెలువరించారు.

ఎస్వీ రామారావు పరిశోధనకు మచ్చుతునక 'తెలుగులో సాహిత్య విమర్శ'. తెలుగులో సాహిత్య విమర్శనా ప్రస్థానం ఎలా కొనసాగిందో ఈ గ్రంథంలో వివరంగా పొందుపరిచారు. తెలుగలో విమర్శ ఆరంభం నుండి నేటి సమకాలీనం వరకు విమర్శ ప్రస్థానాన్ని పేర్కొన్నారు. మొత్తం 8 ప్రకరణాలలో ఈ పరిశోధన గ్రంథం విమర్శ వైభవాన్ని తెలియజేస్తుంది. ఇందులో ప్రాచీన విమర్శకుల నుంచి సమకాలీన విమర్శకుల వరకు సాకల్యంగా పరిశోధించిన తీరు ప్రశంసనీయమని చెప్పవచ్చు. ఇది తెలుగు సాహిత్యలో కానికి ఎస్వీ రామారావు అందించిన బహువ ఎతిగా పేర్కొనవచ్చు. ఈ గ్రంథాన్ని ది ఎవల్యూషన్ ఆఫ్ తెలుగు క్రిటిసిజమ్ పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. అలాగే వీరి తెలంగాణ సాహిత్య చరిత్రను హిస్టరీ ఆఫ్ తెలంగాణ లిటరేచర్ పేరుతో ఆచార్య డి.కనకదుర్గ అనువదించారు. వీరి తెలుగు ఆలోచన గ్రంథాన్ని హిందీలోకి డాక్టర్ బి.వెంకటేశం అనువదించారు.

## సంపాదకులు

ఎస్వీ రామారావు రచయితగా ప్రామాణిక గ్రంథాలను వెలువరించడమే గాకుండా పలు పుస్తకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు. జ్యోతిర్మయి (కవితా సంకలనం), సమర్పణ (కథా సంకలనం), అలంపూరు సంచిక, ఆత్మకూరు సంచిక, సుజాత (గడియారం రామకృష్ణశర్మ షష్టిపూర్తి సంచిక), చౌడూరి ఆరుపదులు (చౌడూరి గోపాలరావు షష్టిపూర్తి సంచిక), మధుర రాగమాలిక (పాలమూరు సంగీతోత్సవ సంచిక), పుష్పాంజలి (బూర్గుల శతకం), నివేదన (బూర్గుల కవితలు), బూర్గుల పీఠికలు, సురవరం ప్రతాపరెడ్డి



వ్యాసాలు (2 భాగాలు), హైదరాబాదు నాలుగు శతాబ్దాల సాహిత్య వికాసం, వేమూరి చంద్రావతి స్మారక సంచిక-3, ఆచార్య వి.ఎల్.ఎస్.భీమశంకరం సప్తతి అభినందన సంచిక, కావ్యత్రయ సమీక్ష (వేమూరి రామనాథం కావ్యాలు), నిశ్శబ్ద సంస్కర్త (వడ్లకొండ నరసింహారావు జయంతి సంచిక), సాహితీ వసునందనం (రావికంటి వసునందన్ షష్టిపూర్తి సంచిక), తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం (వ్యాస సంకలనం), అక్షర వృక్షాలు (పర్యావరణ కవితలు), సంతపురి రఘువీర రావు రచించిన అన్వేషణ గ్రంథానికి, మల్లియరేచన రచించిన తొలి తెలుగు కావ్యం కవిజనాశ్రయంనకు, బూర్గుల రంగనాథరావు సాహిత్యం-1 గ్రంథానికి, తెలుగు సాహిత్య విమర్శ దర్శనం (విజ్ఞాన సర్వస్వం-11) వంటి గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. అలాగే విద్యార్థి (నిజాం కళాశాల), జ్ఞానజ్యోతి (ఏ.యు.కళాశాల), వివేచన (తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం) వంటి కళాశాలస్థాయి సంచికలకు సంపాదకుడిగా వ్యవహరించారు. దూరవిద్యలోని పలు పాఠ్య గ్రంథాలకు పాఠ్యరచన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని డిగ్రీ, ఎం.ఏ. (ప్రథమ, ద్వితీయ) విద్యార్థులకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలోని బి.ఏ., ఎం.ఏ విద్యార్థులకు బెంగళూరు, శ్రీకృష్ణదేవరాయ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాలలోని ఎం.ఏ. విద్యార్థులకు పాఠ్యరచన చేయడంతోపాటు సంపాదకత్వం కూడా వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ డిగ్రీ తరగతులకు తయారు చేసిన గద్యలహరి పుస్తకానికి 1 నుంచి 6వ తరగతి వరకు రూపొందించిన ప్రభుత్వ తెలుగు వాచకాలకు సంపాదకుడిగా వ్యవహరించారు.

## పురస్కారాలు

తెలుగు సాహిత్యంలో చేసిన విశిష్ట సేవలకుగాను పలు పురస్కారాలను ఎస్వీ రామారావు పొందారు. 1994లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ విమర్శ పురస్కారం, 2001లో సహృదయ సాహితీ పురస్కారం, విశ్వసాహితీ విమర్శ పురస్కారం, 2006లో ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ ధర్మనిధి పురస్కారం, 2007లో దాశరథి పురస్కారం, ఉమ్మెత్తల అవార్డు, జీవిఎస్ సాహితీ పీఠం పురస్కారం, 2009లో ఇరివెంటి పురస్కారం, 2010లో కాళోజీ పురస్కారం, 2011లో బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, ధన్వంతరి ఫౌండేషన్ ఉగాది పురస్కారం, దివాకర్ల శతజయంతి పురస్కారం, వానమామలై వరదాచార్యుల జయంతి పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక సాహితీ పురస్కారం, కొండేపూడి సుబ్బారావు సాహితీ పురస్కారం, 2012లో తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి పురస్కారం, గురజాడ అప్పారావు సాహితీ పురస్కారం, సర్వవైదిక సంస్థానం ధర్మనిధి పురస్కారం, పాలమూరు జిల్లా సాహితీ పురస్కారం, 2013లో సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతిభాపురస్కారం, మహబూబ్‌నగర్ జిల్లా తెలుగు భాషా సేవా పురస్కారం, తెలుగు భాషా కోవిద పురస్కారం, 2014లో చౌడూరి గోపాలరావు సాహిత్య పురస్కారం, మాదిరాజు శ్రీనివాసరావు పరస్కారం, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ సాహితీ విశిష్ట పురస్కారం, సోమ సీతారాములు సాహితీ పురస్కారం, 2015లో పాలమూరు జిల్లా స్థాయి ఉత్తమ పరిశోధక పురస్కారం, నవ్య సాహితీ సమితి వసంతోత్సవ పురస్కారం, సాహితీ మేఖల పురస్కారం, వివిఎల్ పురస్కారం వంటివి రామారావు ప్రతిభకు అభినందన పురస్కరంగా లభించినవి. పురస్కారాలే గాకుండా వివిధ సంస్థలు విరివిగా సన్మానిం



చాయి కూడా. తానా, ముంబై ఆంధ్ర మహాసభ, ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్, ఎర్రన్న పీఠం, జి.వి.ఎస్.కళాపీఠం, సూరన సారస్వత సంఘం, పోతన సాహిత్య పీఠం, జ్యోతి కళాపీఠం, పాలమూరు కళావేదిక, పాలమూరు సాహితి, ఆంధ్ర సారస్వత సమితి, కంచికామకోటి పీఠం వంటి సంస్థలు ఎస్వీ రామారావు సాహిత్య కృషికి సన్మానం చేశాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేస్తూనే రాష్ట్రంలోని దాదాపు అన్ని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన సెమినార్లలో పాల్గొని ప్రసంగ పత్రాలను సమర్పించారు. రాష్ట్రేతర ప్రాంతాలైన బెనారస్, మదరాసు వంటి విశ్వవిద్యాలయాల్లో నిర్వహించిన సెమినార్లలో పాల్గొని ప్రాతినిధ్యం వహించారు.

## సంస్థలు

స్వతహాగా సాహితీ కార్యక్రమాల నిర్వాహణ చేయడంతోపాటు పలు సాహిత్య, సాంస్కృతిక సంస్థలకు అధ్యక్షుడిగా పనిచేశారు. జోతిర్మయి, శ్రీనివాస సాహితీ సమితి, విశ్వవిద్యాలయ తెలుగు అధ్యాపక సంఘం, శ్రీరంగాపురం గ్రామసేవా సమితిలకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్ర పద్యకవితా సదస్సుకు ఉపాధ్యక్షుడిగా,



సురవరం సాహిత్య వైజయంతి ట్రస్టు సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కమిటీ సభ్యుడిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు సభ్యుడిగా, శ్రీసత్యసాయి స్టడీ సర్కిల్ సంచాలకుడిగా పనిచేశారు. అటు సాహితీ వ్యాసంగంలోనూ, ఇటు సాహితీ సంస్థల నిర్వహణలోనూ ఎస్వీ రామారావు అందె వేసిన చెయ్యి. ప్రస్తుతం తెలంగాణ సాహిత్య పరిశోధన కేంద్రం అధ్యక్షునిగా పనిచేస్తూ తెలంగాణ సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే పనిలో పడ్డారు.

ఎస్వీ రామారావు పదవీ విరమణ అనంతరం హైద్రబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయంలలో విజిటింగ్ ఫెలోగా పని చేశారు. బెనారస్, బెంగళూరు, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా, పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్‌లోనూ పనిచేయడం విశేషం.

సాహితీక్షేత్రంలో అలుపెరుగకుండా శ్రమిస్తున్న నిరంతర సాహితీ చైతన్యమూర్తి ఆచార్య ఎస్వీరామారావు తెలుగు సాహిత్య పూదోటలో వికసించిన పద్మం. విమర్శనరంగంలో పరిమళించిన సాహితీవనం.

(డా॥ భీంపల్లి శ్రీకాంత్-9032844017)





